ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 11 సంచిక : 9 మే 2006

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 28
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥100/-
విడి ప్రతి : రూ॥ 5/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

సఖినేటిపల్లి ....... 18-02-06
చించినాడ ......... 26-02-06
చించినాడ ......... 08-01-06
జిన్నూరు ............ 30-03-06

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## మంచి చెడులకు మనోవృత్తులే కారణం

ఇంద్రియములకు, ఇంద్రియార్థములగు విషయములకు మధ్య రాగద్వేషములు కలవు. ఇంద్రియముల ద్వారా గ్రహించు విషయములను రాగద్వేష పూర్వకముగా గ్రహించరాదని గీత చెపుతున్నది. మనస్సును నిగ్రహించుకొని, రాగ ద్వేషములకు వశము కాకుండా, శాస్త్రదృష్టిని అవలంబించుట ఆవశ్యకము. దానికి పురుష ప్రయత్నము కావాలి. పూర్వజన్మ సంబంధములగు వాసనలు శుభకరములు, అశుభకరములు అని రెండు విధములుగా ఉంటాయి. శుభవాసనలు శాశ్వతమైన బ్రహ్మపదమునకు చేర్చితే, అశుభ వాసనలు సంకటములు కలిగిస్తాయి. కాబట్టి అశుభవాసనలను ప్రయత్నపూర్వకంగా మంచి పనుల యందు ప్రవేశపెట్టవలెనని యోగవాశిష్ఠంలో వసిష్ఠులవారు చెప్పియున్నారు. దీనికే పురుష ప్రయత్నము అని పేరు.

జీవుల యొక్క జన్మాంతర కర్మములననుసరించి సత్వ, రజ స్తమో గుణములుదయించును. ఆయా గుణముల కనుగుణంగా మనోవృత్తులు, మనోవృత్తుల ననుసరించి ప్రవర్తించు స్వభావము గల జ్ఞాన కర్మేంద్రియములచే పుణ్యము, పాపము మొదలగు కర్మలు ఆచరించబడుచుండును. కాబట్టి మంచి పనులు చేయుటకుగాని,

చెడ్డ పనులు చేయుటకుగాని మనోవృత్తులే కారణము. గుణములే మనోవృత్తులను ప్రేరేపించుచుండును కనుక జీవుడు ఉచ్ఛనీచ జాతులందు జన్మించుటకు కారణము గుణములతోటి తాదాత్మ్యమే.

పుట్టుకతో గుడ్డివాడు దృతరాష్ట్రుడు. అందుచే రాజు కాలేకపోయాడు. సంతానం కలుగక పూర్వము పాండు రాజుపై ప్రేమజూపిన దృతరాష్ట్రుడు దుర్యోధనుడి జననం తర్వాత తమ్ముని బిడ్డలయిన పాండవులపై ద్వేషము పెంచుకొన్నాడు. భీష్మ, ద్రోణ, విదురుడు, సంజయుడు చెప్పిన మంచి మాటలు, హితోపదేశములు చెవికెక్కలేదు. దుష్ట చతుష్టయముల మాటలు ఇంపుగా తోచాయి. "యతో ధర్మస్తతోః కృష్ణో; యతః కృష్ణస్తతో జయః" అని సంజయుడు ఎన్ని మారులో చెప్పినాడు. శ్రీకృష్ణుని విశ్వరూపమును రాయబార సమయమున దర్శించినాడు. విదురుడు నీతి శాస్త్రమును, సనత్సుజాత మహర్షి ఆధ్యాత్మ శాస్త్రమును బోధించారు. యుద్ధభూమిలో శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి బోధించిన గీతను సంజయుని ద్వారా విన్నాడు. అయినా కూడా దృతరాష్ట్రుడు వక్రమార్గము నుండి తన బుద్ధిని మళ్ళించు కోవటానికి తగిన పురుష ప్రయత్నాన్ని చేయలేదు. తన దుర్మార్గపు బుద్ధిని మార్చుకోలేదు. 'పుట్టుకతో వచ్చిన పాపబుద్ధి పుడకలతోటి గాని పోదు' అన్న సామెత మాదిరిగా దృతరాష్ట్రుని మనోవృత్తులట్లున్నవి.

వెనక చేసిన కర్మను ఇప్పుడు మనమేమి మార్చలేము. అది జరిగిపోయినది. చేయవలసినదెల్లా ఆ కర్మానుసారముగ పుట్టు గుణములను అరికట్టే ప్రయత్నము చేయాలి. త్రిగుణములను అతిక్రమించిన జీవుడు జన్మ జరామృత్యువు. దుఃఖ రూపమైన సంసారము నుండి జీవించియుండగానే ముక్తుడై అమృతత్వాన్ని పొందుతాడు. ఈశ్వరుని నిశ్చలమైన భక్తితో జీవించువాడు, గుణములను అతిక్రమించి మోక్షార్హుడగునని గీతాచార్యులు సెలవిచ్చియున్నారు.

– బొప్పన అరుణాదేవి, హైదరాబాద్

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-02-06, సఖినేటిపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భక్తులందరూ కూడా ఎవరు చెప్పినా సబ్జక్టు బాగా వినండి, అర్థం చేసుకోండి. కారణం ఎప్పుడూ సూక్ష్మంగా ఉంటుంది, కార్యం స్థూలంగా ఉంటుంది. మీకు ఏదైనా అనారోగ్యం వస్తే ఆకారణం ఎక్కడో సూక్ష్మంగా ఉంటుంది. ఆ రోగం మనకు కనిపిస్తూ ఉంటుంది, రోగ కారణం కనబడదు. అలాగే ఈ సృష్టికి కారణం భగవంతుడు, ఆయన ఎక్కడో సూక్ష్మంగా ఉంటాడు. ఆయన కనబడడు, సృష్టి మనకు కనిపిస్తూ ఉంటుంది. జబ్బు కారణం తెలిస్తేనేకాని జబ్బు పోదు. అలాగే ఈ జగత్తుకు కారణం అయిన భగవంతుడు మనకు అనుభవంలోనికి వచ్చేవరకు జగత్తు అదృశ్యం కాదు. సత్యం నీ హృదయంలో ఉంది. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేయటం మానివేసి రేపు ఏమి జరుగుతుంది, చనిపోయిన తరువాత ఏమౌతాము, స్వర్గ లోకంలో ఏముంది అని ఇటువంటి పిచ్చిగొడవలలో పడిపోతున్నాము. త్రిమూర్తుల యొక్క సమైక్య స్వరూపమే కృష్ణుడు, వాడే నారాయణుడు. మనం బాగుపడటానికి ఉపయోగపడే మాటలు అనేకం గీతలో చెప్పాడు. ఆత్మజ్ఞానం పొందటానికి ఎంతో సమన్వయం చేసి గీతలో పరమాత్మ చెప్పాడు. అధ్యయనం చెయ్యటానికి, అర్థం చేసుకోవ టానికి మనం ఎంతోకొంత ప్రయత్నం చేయాలి. ఆత్మానుభవం పొందటానికి ప్రయత్నం చేయటం మానివేసి, భక్తిపేరుమీద కేవలం అనాత్మవిషయాల మీద పడిపోతున్నాము. సాధకులు ముఖ్యంగా తిండి దగ్గర, మాట దగ్గర జాగ్రత్తగా ఉండాలి. సత్యాన్వేషకుడు సమానంగా తినాలి, సమానంగా మాట్లాడాలి, సమానంగా నిద్రపోవాలి. ఈ మూడింటిలో హెచ్చుతగ్గులు పనికిరావు. సత్పురుషులతో సహవాసం వలన మనకు లాభం కలుగుతుంది. అయితే ఎవడు సత్పురుషుడు అంటే సత్యసాక్షాత్కారం పొందినవాడు సత్పురుషుడు, వారితో సహవాసం మంచిది, వారు అన్నీ ఇస్తారు, మోక్షం కూడా ఇస్తారు. ప్రారబ్దాన్ని బట్టి దేహం వస్తుంది, ప్రతీ దేహము ప్రారబ్దమే. ఆ ప్రారబ్దం అయిన వెంటనే దేహం పడిపోతుంది. మనకు చావు అంటే చాలా భయం. చావు అనేది బహుచిన్న విషయం, పాతశరీరం పోతుంది కొత్తశరీరం వస్తుంది అంటే ఒక ఇంటిలో నుండి ఇంకో ఇంటిలోనికి వెళ్ళటం. మనం ఇల్లు మారుతున్నాము అనుకోండి ఈ కొంపకంటే ఆ కొంప బాగుండాలి అనుకొంటాము. ఇక్కడ కంటే సదుపాయాలు బాగున్నాయా అని చూసుకొంటాము. ఎలాగైనా మనకు కొంతకాలం ఈ శరీరం అనే కొంపలు తప్పవు కాబట్టి ఈ శరీరం పడిపోయిన తరువాత ఇంతకంటే ఆరోగ్యకరమైన శరీరంలోనికి, మోక్షం సంపాదించటానికి అనుకూలమైన శరీరంలోనికి వెళ్ళాలి అని కోరుకోవాలి. ఎవడైతే పునర్జన్మ

రహితస్థితిని పొందాడో వాడే గమ్యాన్ని చేరుకొన్నట్లు అని భగవంతుడు చెపుతున్నాడు.

జ్ఞాని సత్యాన్ని చూస్తాడు, అసత్యాన్ని చూడడు. ఇక్కడ అనేకమంది ఉన్నారు. మీ గుణాలు వేరు, రంగులు వేరు, పేర్లు వేరు, రకరకాలుగా ఉన్నారు. ఎవరి సంస్కారం వారిది, ఎవరి ప్రారబ్దం వారిది, ఎవరి రంగు వారిది. కాని జ్ఞాని ఆత్మకాని విషయాలను చూడడు, అందరి హృదయాలలో చైతన్యరూపంలో ఉన్న అంతర్యామినే చూస్తూ ఉంటాడు. అందుచేత జ్ఞానికి వికారం కలుగదు. వాడికి ద్వైతం లేదు. మనకు ఏదైనా తలంపు వచ్చినప్పడే, సంకల్పం వచ్చినప్పడే ద్వైతం వస్తుంది, తలంపు లేకపోతే ద్వైతం లేదు. మీరు చనిపోతారు అని డాక్టరు చెప్పాడు అనుకోండి, మనకు వెంటనే భయం వస్తుంది. ఎందుచేత చెప్పండి. మనకు దేహం అంటే బాగా ఇష్టం, దేహాభిమానం ఎక్కువ, ఈ దేహమే నేను అనుకోవటం వలన దేహం చనిపోయినప్పడు భయం వేస్తోంది. దేహంతో తాదాత్మ్యం లేనివాడికి దేహానికి చావు వచ్చిన వాడికి భయం లేదు. దేహంతో తాదాత్మ్యం ఉన్నవాడికి చావు అంటే అది గొప్ప విషయం కాని దేహంతో తాదాత్మ్యం లేనివాడికి చావు అంటే అది చాలా చిన్న విషయం. మనకు స్వరూపజ్ఞానం కలిగేవరకూ ఈ కొంపలు మారటం తప్పదు. మనం సాధన బాగా చేస్తూఉంటే, నిష్కామకర్మ చేస్తూఉంటే, మనోనిగ్రహం కోసం ప్రయత్నం చేస్తూఉంటే ఇంతకంటే మంచికొంపలకు వెళ్ళే అవకాశం ఉంది. స్వార్థం లేకుండా పని చెయ్యటం మీరు అనుకొన్నంత తేలికకాదు. స్వార్థం లేకుండా పనిచేసేవాడికి అది తెలుస్తుంది. స్వార్థం లేకుండా పని చెయ్యటం గురించి పుస్తకాలలో చదువుకోవచ్చు, అలా పని చేసేటప్పడు అందులో ఉన్న కష్టం మనకు తెలుస్తుంది. ఫలాపేక్ష లేకుండా, విషయాపేక్ష లేకుండా పని చెయ్యటం చాలా కష్టం, అది ప్రాక్టీసు చేసేటప్పడు అందులో ఉన్న కష్టం తెలుస్తుంది. దిగిన వాడికి లోతు తెలుస్తుంది గాని గట్టుమీద కూర్చున్నవాడికి ఏమి తెలుస్తుంది. దుఃఖానికి కారణం బయట లేదు, నీ లోపలే ఉంది, అదే కర్తృత్వం. ఏవో బయట కారణాల వలన దుఃఖం వస్తోంది అని నీవు అనుకొంటున్నావు కాని బయట కారణాల వలన దుఃఖం రావటం లేదు, కర్తృత్వం వలననే నీకు దుఃఖం వస్తోంది. కర్తృత్వం కారణం, దుఃఖం కార్యం. అందుచేత కర్తృత్వం నశిస్తే దుఃఖం నశిస్తుంది. కర్తృత్వం ఎలా నశిస్తుంది అంటే దీనికి గీతలో చాలా విపులంగా చెప్పాడు. ఈ సంస్కారం మనకు అనేక జన్మలనుండి వస్తోంది. నేను అనేది ఒక తలంపు, నాది అనేది ఒక తలంపు. మనం భగవంతుడికి పుష్పాలు ఇస్తున్నాము, పండ్లు ఇస్తున్నాము కాని ఈ నేను అనే తలంపును, నాది అనే తలంపును భగవంతుని పాదాల దగ్గర ఉంచే ఆ నేర్పుగాని, ఆ ఓర్పుగాని మనకు ఇంకా రాలేదు. కర్తృత్వం అనేది ఒక ప్రకృతి వాసన, ఇది అనేక జన్మల నుండి వస్తోంది. కర్తృత్వం నశించాలి అంటే అది నశించదు.

నిష్కామంగా పనిచేసే వాడికి, నిరాడంబరంగా జీవించేవాడికి, కర్మను యోగంగా చేసేవాడికి కర్తృత్వం నశిస్తుంది కాని లేకపోతే కర్తృత్వం నశించదు. చావులు, పుట్టుకలు, సంతోషాలు, దుఃఖాలు, లాభనష్టాలు ఇవి అన్నీ అహంకారానికే. మీకు ఏదైనా కలిసివస్తుంది అనుకోండి సంతోషిస్తారు. ఆ సంతోషించేది మీలో ఉన్న చైతన్యం కాదు, అహంకారమే సంతోషిస్తుంది. మీరు అనుకొన్న పనులు అవ్వటం లేదు అనుకోండి కృంగిపోతూ ఉంటారు, ఆ కృంగిపోయేది అహంకారమే, పొంగిపోయేది అహంకారమే. అది మీరు కాదు అని అర్థమయితే మీకు సమానబుద్ధి కలుగుతుంది. నువ్వు జపం చేస్తావు, ధ్యానం చేస్తావు, నదులలో స్నానాలు చేస్తావు, గుడులు చుట్టూ తిరుగుతావు అనుకో, నీ బుద్ధి మంచిది కాదు అనుకో నీ కర్తృత్వం ఎలా నశిస్తుంది. మంచి పనులు చేస్తే పుణ్యం వస్తుంది. నీవు పరిశుద్ధుడవు కాకపోతే కర్తృత్వం నశించదు. భగవంతుడు అంటే ఒక కాలానికో, ఒక దేశానికో, ఒక సంఘటనకో పరిమితమైన వాడు కాదు. పరిమితులు లేని వాడే భగవంతుడు, వాడే ఈశ్వరుడు. మన మనస్సుకు పరిమితులు ఉన్నాయి కాని చైతన్యానికి పరిమితులు లేవు. మన మనస్సులో ఉన్న జబ్బులను వదిలించుకొంటే మీరు ఇప్పుడే సుఖపడవచ్చు. రాగద్వేషాలు మన మనస్సులో ఉన్న జబ్బులు. ఆ జబ్బులు తగ్గిపోతే దుఃఖం లేదు. ఈ జబ్బులు మన మనస్సులో ఎంతకాలం అయితే ఉన్నాయో అంతకాలం మనకు దుఃఖం తప్పదు, పునర్జన్మలు వస్తాయి. ఈ జబ్బులు పోవటానికి కృష్ణుడు సుద్దులు చెపుతున్నాడు. ఎన్ని సాధనలు చేసినా ముందు మీరు మనో నిగ్రహాన్ని అలవర్చుకోవాలి. మనస్సును అదుపులో పెట్టుకోవాలి. స్వాధీనమైన మనస్సుతోటి, స్వాధీనమైన ఇంద్రియాల తోటి నువ్వు పని చేస్తూ ఉంటే కొంతకాలానికి కర్తృత్వం నశిస్తుంది. గీతలో అనేక మంచి గుణాల గురించి, కళ్యాణగుణాల గురించి పరమాత్మ చెప్పాడు. ఒక్క మంచిగుణాన్ని తీసుకొని ప్రాక్టీసు చేస్తే మిగతాగుణాలు అన్నీ కూడా వచ్చేస్తాయి. అలాగే ఒక్క జిహేంద్రియాన్ని కంట్రోలు చేయటానికి ప్రయత్నం చేస్తే మిగతా ఇంద్రియాలు కూడా స్వాధీనంలోనికి వచ్చేస్తాయి అని గాంధీగారు చెప్పారు.

నాకు అది కావాలి, ఇది కావాలి అని మీరు కోరుకోవద్దు. మామూలుగా సుఖంగా బతకండి, మిమ్మల్ని ఎవరైనా స్తోత్రం చేస్తే మీ అహంకారాన్ని ఉబ్బించుకోకండి, నిందిస్తే కృంగిపోకండి. నేచురల్‌గా బతకండి, నార్మల్‌గా బతకండి. మీరు ఏమీ కోరుకోనక్కర లేకుండానే మీ కోరికతో సంబంధం లేకుండా మీ అవసరాలు ఎప్పుడు తీర్చాలో, ఎక్కడ తీర్చాలో ఈశ్వరుడు తీరుస్తాడు. మీరు ఎంత సహజంగా జీవిస్తూ ఉంటే మీ కోరికలు కూడా అంత సహజంగా నెరవేరతాయి అనే సంగతి విస్మరించకండి అంటున్నాడు పరమాత్మ. మీ కోరికలు నెరవేర్చు కోవటానికి వేషాలు వేయనక్కరలేదు, గంతులు వేయనక్కరలేదు,

మీరు అసహజంగా, కృత్రిమంగా ఉండనక్కరలేదు. మీరు సహజంగా ఉండండి, భగవంతుడు మీ కోరికలను సహజంగానే నెరవేరుస్తాడు. శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు వెళ్లేటప్పుడు మనం చాలా బాధ పడిపోతాము. శరీరంలో నుండి ప్రాణం బయటకు పోయేటప్పుడు ఎంతోకొంత బాధ ఉంటుంది. ముసలమ్మలు ఏమి చేస్తారు అంటే చెవులలో నారాయణ, నారాయణ అంటారు. అది వాడికి వినబడి చస్తే కదా. మనం నారాయణ అంటే లోపల వినేవాడు ప్రాణం పోయే బాధలో ఉన్నాడు, ఇది వాడికి ఏమి వినిపిస్తుంది. మనం వయస్సులో ఉండగా నారాయణ స్మరణ చేస్తూ ఉంటే జీవుడు శరీరంలో నుండి పోయేటప్పుడు కూడా నారాయణ స్మరణ వస్తుంది గాని మనకు వయస్సులో ఉండగా నారాయణ స్మరణ లేదు. చనిపోయే టైములో ప్రక్కన ముసలమ్మలు నారాయణ అంటే వాడి బాధలో వాడు ఉంటాడు, ఇది వాడికి వినబడదు. ప్రాణం పోయేటప్పుడు దుఃఖం, బాధ ఉంటాయి. అంతబాధలోకూడా నారాయణ స్మరణ నిలబెట్టుకోవటం గాంధీగారికే సాధ్యమైంది. ఎందుచేతనంటే జీవితం పొడుగునా ఆయన నారాయణ స్మరణ చేసారు. అందుచేత మనం వయస్సులో ఉండగా కష్టపడి సాధన చేస్తే అది మనస్సులో ఉంటుంది గాని వయస్సులో ఉన్నప్పుడు సాధన మానివేసి రేపు శరీరానికి చావు వస్తుంది అనగా సాధన చేసినా దాని వలన పెద్ద ప్రయోజనం ఉండదు, మరణ సమయంలో నారాయణ స్మరణ రాదు. అందుచేత మీరు కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. నీ మనస్సులో కల్మషం పెట్టుకొంటే కర్తృత్వబుద్ధి ఎలా నశిస్తుంది. శ్రీకృష్ణచైతన్యకు నాలుక మీద పంచదార వేస్తే తాటిపట్టి మీద వేసినట్లుగా ఉంది, పంచదార యొక్క ఒక్క కణం కూడా చెమ్మ అవ్వలేదు. అది ఇంద్రియనిగ్రహం. వాడికి ఇంద్రియాలు ఉన్నా, ఇంద్రియాలు లేనివాడితో సమానము, శరీరం ఉన్నా శరీరం లేనివాడితో సమానము. ఆత్మదర్శనం అయిన వాడికి భేదబుద్ధి నశిస్తుంది. భేదబుద్ధి నశించినవాడికి భయం నశిస్తుంది. భయం నశించిన వాడికి మోక్షం కలుగుతుంది. నా హృదయంలో ఉన్న నిజం నాకు గోచరించి నప్పుడు మీ హృదయంలో ఉన్న నిజం కూడా అదే అని నాకు అర్థమవుతుంది.

దేహము నేను అనే తలంపులోనుండే ఇతరతలంపులు వస్తాయి. గాఢనిద్రలో ఎవరికి దుఃఖం లేదు. కారణం ఏమిటి? అక్కడ తలంపులు లేవు. తలంపులు లేకుండా దుఖం రాదు. ఈ తలంపులు అన్నీ ఎక్కడ నుండి వస్తున్నాయి. దేహము నేను అనే తలంపు నుండి వస్తున్నాయి. దేహము నేను అనే తలంపు అణిగేవరకూ ఆ తలంపులు కూడా అణగవు, భక్తి వేరు, శరణాగతి వేరు. భక్తిలో ద్వైతం ఉంటుంది. నువ్వు వేరు, నేను వేరు అనుకొంటాడు. శరణాగతిలో జీవుడు లేడు, దేవుడే, అది అద్వైతం. శరణాగతిలో ఇంక దుఃఖం వచ్చే అవకాశం లేదు. ఎందుచేతనంటే అక్కడ జీవలక్షణాలు లేవు. ఉన్నది ఈశ్వరుడే. మాట కంటే మౌనం

గొప్పది. మౌనం అంటే వాక్కు మౌనం కాదు. మనస్సు ఎక్కడయితే అణిగిందో అక్కడ నుండి మౌనం వస్తుంది. మనం గుంట తీసినప్పుడు నీరు పడితే అది జల కింద ఉబికి ఉబికి వచ్చేస్తుంది. అలాగే మనస్సు ఎక్కడ నుండి అయితే వచ్చిందో అక్కడికి వెళ్ళి అణిగిపోతే ఆనందం కూడా జల కింద ఉబికిఉబికి వస్తుంది. అప్పుడు సుఖం కోసం, ఆనందం కోసం బయటపరిస్థితుల మీద ఆధారపడనక్కరలేదు. చైతన్యంలో నుండి నేను అనే తలంపు వచ్చింది. ఆ నేను అనే తలంపులో నుండి మన సంస్కారాన్ని బట్టి ఇతర తలంపులు వస్తాయి. తలంపు వచ్చాక మాట వస్తుంది. లోపల ఉన్న చైతన్యానికి మాట ముని మనవడు. తాతగారిని వదిలేసి మునిమనవడిని పట్టుకొంటున్నావెందుకు? తాతగారు దొరికితే ఆయన్నే పట్టుకోండి, వాడు దొరకకపోతే ఈ మాటలు. భగవంతుడు మీ శరీరం ద్వారా మంచి పని చేయాలను కొన్నాడు అనుకోండి. దేవుడి దగ్గర నుండి ఆ ప్రేరణ ప్రారంభమయినప్పుడు మీరు ఆ పని చెయ్యకుండా ఎవరూ ఆపలేరు. నీ దేహం ద్వారా మంచి పని చేయాలని దేవుడు అనుకొన్నప్పుడు అది నీకు ఇష్టం లేకపోయినా ఆగదు. ఆ ప్రేరణ అక్కడ నుండి వస్తుంది, అది శక్తివంతంగా ఉంటుంది. కర్తృత్వం వూరికే పోతుంది అనుకొంటున్నావా? అది బుడగ అనుకొంటున్నావా పోవటానికి? నీవు పూజ చేస్తావు, జపం చేస్తావు అనుకో నీకు కపటం పోలేదు అనుకో, కర్తృత్వం ఎలా నశిస్తుంది. దీనికి ఇంద్రియాలు సహకరించాలి, మనస్సు సహకరించాలి, భగవంతుని పాదాలను ఆశ్రయించాలి. కోరిక లేకుండా కర్మ చేయాలి, ఫలాపేక్ష లేకుండా చేయాలి. కొంతమంది ఇంట్లో అందరూ మంచి వారి మధ్యే ఉంటారు కాని ఎప్పుడూ అశాంతిగా ఉంటారు. మీకు అశాంతి ఎక్కడ నుండి వస్తోంది, మనస్సులో నుండి వస్తోంది. మనస్సు విజృంభిస్తూ ఉంటే అశాంతి వస్తోంది, మనస్సు అణిగినప్పుడు శాంతి వస్తోంది. ఈ అశాంతికి కారణం నీ మనస్సు, శాంతికి కారణం నీ మనస్సు. ఆ మనస్సును సరిచేసుకోవటం మానివేసి బజారులో పడతావు ఏమిటి? ముందు మనస్సును బాగుచేసుకో, దానిని పవిత్రం చేసుకో.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-02-06, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు మహాశివరాత్రి. శివ అంటే శుభకరుడు, మనకు శుభాలను తీసుకొని వచ్చేవాడు, సర్వాన్ని పాలించేవాడు ఆయనే, పంచభూతాలను జీవకోటిని నియమించేవాడు, పాలించేవాడు ఆయనే. ఆయనే సర్వేశ్వరుడు. ఆయన కంటే భిన్నంగా ఏమీ లేదు. సంవత్సరంలో మీకు ఏరోజు అంటే ఇష్టం అని పార్వతి శివుడిని అడిగితే శివరాత్రి అంటే ఇష్టం అని చెప్పాడు, ఆ రోజు ఉపవాసం ఉండే భక్తులను అనుగ్రహిస్తాను అని చెప్పాడు. ఈ

రోజు సాంప్రదాయం ఏమిటి అంటే పగలు ఉపవాసం చేస్తారు, రాత్రి జాగరణ చేస్తారు. శివుడు, విష్ణువు వేరు కాదు. శివుడి యొక్క హృదయం విష్ణువు, విష్ణువు యొక్క హృదయం శివుడు. శివుడిని లింగరూపంలో ఆరాధిస్తారు, విష్ణువును మూర్తి రూపంలో ఆరాధిస్తారు. మన మనస్సు వేరు చేస్తుంది కాని ఇద్దరూ ఒక్కటే. మన మనస్సుకు ఎంతసేపు వేరు చేయటమే పని. అందుచేత నీ మనస్సు నిగ్రహంలో ఉంటే, నీ మనస్సు నీ అదుపులో ఉంటే, శాంతిగా ఉంటే మీ స్నేహితుల సహాయంగాని, బంధువుల సహాయంగాని, తల్లితండ్రుల సహాయంగాని అక్కరలేకుండానే నువ్వు సుఖంగా బతకవచ్చు అని శాస్త్రం చెప్పింది. వారు సహాయం చేస్తే స్వీకరించవచ్చు, ఒకవేళ వారు సహాయం చేయకపోయినా మీ సుఖానికి లోటు లేదు. అంటే మనస్సును నియమించుకోవటం వలన అంత గొప్పతనం వస్తుంది. మనస్సులో శాంతి ఉంటే మాటలో శాంతి ఉంటుంది, మాటలో శాంతి ఉంటే చేతలో శాంతి ఉంటుంది, అప్పుడు శరీరం ఉండగా సుఖం, మరణానంతరం కైలాసం. నేను ఎవడను? అనే విచారణ చేసి ఈ దేహం నేను కాదు, ఈ మనస్సు నేను కాదు అని తెలుసుకోవటమే నేను ఎవడను? అనే విచారణ యొక్క ప్రయోజనం అని భగవాన్ చెప్పారు. చైతన్యానికి వేరుగా నీవు లేవు. వేరుగా ఉన్నాను అనేది ఒక తలంపు మాత్రమే. ఆ తలంపును పోగొట్టటానికే నేను ఎవడను అనే విచారణ. మనిషి జీవితాన్ని పెనవేసుకొని ఉన్న అహంభావనను తొలగించటానికే అరుణాచలం ఆవిర్భవించింది. శివుడికి పేదవాళ్ళ దేవుడు అని పేరు ఉంది. ఆయనను పూజించటానికి ధనం అక్కరలేదు, బంగారం, వెండి అక్కరలేదు. ఒక అరటిపండు పెడితే చాలు, ఆయన పొంగిపోతాడు. ఒకవేళ అరటిపండు లేకపోయినా ఆయన నెత్తిమీద నీరుపోసినా ఆయన సంతోషిస్తాడు. కొంతమంది శివభక్తులు ఏమి చేస్తారు అంటే ఆయన నెత్తిమీద నీరుపోస్తూ శివనామాలు చదువుతూ ఉంటారు. మనస్సులో ఏమి అనుకొంటారు అంటే నేనేమో నీళ్ళు పెట్టి నిన్ను కడుగుతున్నాను, నీవేమో నీ అనుగ్రహంతో నా బుద్ధిని కడుగు అంటారు. అంటే నీ అనుగ్రహాన్ని పంపి నా బుద్ధిలోని దోషాలను తొలగించు అని ప్రార్థించటం.

మిమ్మల్ని ఎవరైనా స్తోత్రం చేస్తే సంతోషం వస్తుంది, విమర్శిస్తే దుఃఖం వస్తుంది. ఎందుచేతనంటే మీకు చైతన్యభావన లేదు. ఫలానా శరీరం నాది, ఫలానా పేరు నాది అనేటువంటి వ్యక్తిభావన మీకు ఉంది. మీరు కానిదానితో అంటే అనాత్మతో తాదాత్మ్యం వలన మీకు దుఃఖం వస్తోంది. అనాత్మలోనుండి విడిపోతే దుఃఖం నశిస్తుంది. మనకు ఈశ్వరచింతనలేదు, ఎంతసేపు విషయచింతనలో ఉంటున్నాము. విషయచింతన చేసే వాడికి అపవిత్రత పెరుగుతుంది, అహంభావన పెరుగుతుంది. ఈశ్వరుని స్మరించే వారికి

వ్యక్తి భావన తగ్గుతుంది, పవిత్రులవుతారు. మనం సత్యంకానిదానిని, ఆత్మకాని దానిని ధ్యానం చేస్తూ ప్రకృతి వలలో పడి, చావుపుట్టుకల మధ్య నలిగిపోతూ, దుఃఖంతో పీడింపబడుతున్నాము. ప్రారబ్దాన్ని బట్టి మనకు దేహాలు వచ్చాయి. దేహం యొక్క ప్రారబ్దాన్ని బట్టి లోపలఉన్న అంతర్యామి ఆ జీవుడిని నియమిస్తూ ఉంటాడు. దేహం ప్రారబ్ధాన్ని అనుభవిస్తూ ఉంటుంది. ప్రారబ్ధమును నేను అనుభవిస్తున్నాను అని జీవుడు అనుకొంటూ ఉంటాడు. ఇప్పుడు నీవు దేహంతో, మనస్సుతో ఎలా ఏకంగా ఉన్నావో అలాగ అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడితో ఏకమైనప్పుడు ప్రారబ్దం నిన్ను ముట్టుకోదు, అది నిన్ను అంటదు. మీరు లోపల ఉన్న సత్య పదార్థముతో ఏకమై ఉన్నారు అనుకోండి బయట పరిస్థితులు మీకు అనుకూలంగా లేకపోయినా దాని తాలుక దుఃఖం మీకు రాదు. ఎందుచేతనంటే మీరు దుఃఖంలేని వస్తువుతో ఏకమై ఉన్నారు. ఒకవేళ బయటపరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా మీకు పొంగు కూడా రాదు, మీ మొఖం అటు చూడదు. ఏ వస్తువు అయితే నీలో అంతర్యామిగా ఉందో అది నీవే అన్న సంగతి నీకు తెలిసినప్పుడు దురదృష్టంగాని, అదృష్టం గాని, బయటపరిస్థితులు ఏమీ కూడా నిన్ను అంటవు.

మనం శివనామాన్ని స్మరించినా, ఆ రూపాన్ని ధ్యానించినా ఇది అంతా మనం పవిత్రులు అవ్వటానికే. మనస్సు ఏదో పని చెయ్యకుండా ఉండలేదు. ఇప్పుడు మనం శివ స్మరణ విడిచిపెట్టాము అనుకోండి విషయాలను స్మరిస్తూ ఉంటుంది. విషయాలను స్మరిస్తూ ఉంటే మనస్సుకు విషయాల మీద ఆకర్షణ కలుగుతుంది, అప్పుడు మనస్సు బాహ్యాముఖానికి పోతుంది. ఏ కారణం వలన మన మనస్సు బాహ్యాముఖానికి వెళుతోందో దానిని కత్తిరించటమే సాధన యొక్క ప్రయోజనం, ప్రతీవాడు ఇది లోపల చూసుకోవాలి. మన మనస్సు పల్చబడితే, మన మనస్సు పవిత్రం అయితే మనకు ఆనందం దొరుకుతుంది. మన మనస్సును పల్చబడేటట్లు చూసుకోవటం మానివేసి ఆనందం కోసం బజారులో వెదికితే నీకు ఎంత ధనం ఉన్నా, ఆస్తి ఉన్నా కూడా నీవు ఇలా కోటిజన్మలు ఎత్తినా ఆనందం నీకు దొరకదు. ఎందుచేతనంటే ఆనందం బయట లేదు. మీకు అందరికి నేను ఏదో సహాయం చేయటం గొప్పకాదు, మీరు అందరూ బాగుపడాలి అని నేను నిజంగా కోరుకొంటున్నానా? లేదా? అని అంతర్యామిగా ఉన్న భగవంతుడు చూస్తాడు. మీరు బాగుపడాలి అని నేను నిజంగా కోరుకోవటం లేదు అనుకోండి, ఈ ప్రవచనాలు చెప్పటం అనవసరం, నేనే కాదు ఇతరులు ఎవరైనా కూడా అంతే. ఇతరులు బాగుపడాలి అని మీరు నిజంగా లోపల కోరుకొంటూ ఉంటే, ఆ తలంపే కనుక నిజమైతే మీరు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. దయలేనివాడు వాడికి ఎంత పాండిత్యం ఉన్నా ఆచార్యుడు అవ్వలేడు. ఈ ప్రపంచంలో

ఎక్కడికి వెళ్ళి చూసినా రాగద్వేషములు తప్ప ఏముంది? అన్నాడు బుద్ధుడు. ఈశ్వరుని దయ లేకుండా కేవలం మన ప్రయత్నం వలన రాగద్వేషముల నుండి విడుదల పొందలేము. మనకు ఉంటే ఇష్టం, లేకపోతే అయిష్టం. ఇవి లేకుండా మనం ఉదాసీనంగా ఉంటే, శాంతిగా ఉంటే మనలో ఉన్న వాసనలు పోతాయి, కొత్తవాసనలు రావు, ఇది మనం గ్రహించలేక పోతున్నాము. మనం ఉదాసీనంగా ఉండకుండా ప్రతీ గొడవలోనికి వెళ్ళి కలిసిపోతూ ఉంటే పూర్వజన్మల నుండి తెచ్చుకొన్న వాసనలు అలాగే ఉండిపోతాయి, గొడవలు పెంచుకోవటం వలన కొత్త వాసనలు వచ్చి కలుస్తాయి. చెరువులో పాత నీరు అలాగే ఉంది, కొత్త నీరు వచ్చి కలుస్తోంది. ఇంక చెరువు ఎలా ఎండిపోతుంది. మనం పవిత్రత సంపాదించ కుండా రాగద్వేషములు నశించవు. మనకు రాగద్వేషములు లేవు అనుకోండి ఇంక మనస్సుకు చాపల్యమే ఉండదు. సభ్యత ఉన్న మనిషికి, సంస్కారం ఉన్న మనిషికి హృదయం విశాలమవుతుంది, వాడు ఈశ్వరుని దయకు పాత్రుడవుతాడు. ఈశ్వరుని దయకు పాత్రుడయిన మనిషి చేసే పని వృధా అవ్వదు. ఈశ్వరుని దయ పొందటం కోసం మనం ఏదైనా పనిచేస్తే రాబోయే జన్మలో అయినా ఏదో రూపంలో మిమ్మల్ని కరుణిస్తాడు. మీరు చేసింది ఊరికే పోదు. మంచి చేసినవాడికి దుర్గతి లేదు అని పరమాత్మ చెప్పాడు. అయితే ఆ మంచి పని ఎలా చెయ్యమన్నాడు అంటే మన చెయ్యి నోట్లో అన్నం పెడుతుంది. మన నోటికి ఉపకారం చేస్తున్నాను, పొట్టకు ఉపకారం చేస్తున్నాను అని చెయ్యి అనుకోదు ఎందుచేతనంటే చెయ్యి కూడా శరీరంలో భాగమే. చెయ్యి నోటిలో పెట్టింది మరల బలంగా మారి ఆ చేతికే వచ్చేస్తుంది. మీరు సమాజం కోసం ఏదైనా చేస్తే అలాగ చెయ్యండి. ఇతరులకు నీవు ఏదైనా చేస్తే అది నీకే తిరిగి వచ్చేస్తుంది అన్న సంగతి నీకు తెలియక ఏదో వాళ్ళను ఉద్ధరించాను అని అనుకొంటున్నావు. సాధనలో అన్నింటికంటే ముఖ్యంగా తిండి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. తిండి వలన మన శరీరమే కాదు, మనస్సు కూడా తయారవుతుంది. తిండి విషయంలో జాగ్రత్తగా ఉంటే శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం బాగుంటుంది. శారీరక ఆరోగ్యం, మానసికఆరోగ్యం బాగా ఉంటే వాడు ఈశ్వర సాక్షాత్కారం పొందటానికి అర్హుడవుతాడు. శివ స్వరూపం ఎవరికి తెలుస్తుంది అంటే మూడు అవస్థలను, మూడు గుణాలను, మూడుశరీరాలను దాటినవాడికి శివస్వరూపం తెలుస్తుంది. ఎవడైతే శివానుగ్రహాన్ని పొందాడో వాడిని ఈ మూడు అవస్థల నుండి, మూడు శరీరాల నుండి, మూడు గుణాల నుండి దాటించి ఆయన స్వరూపాన్ని ఇస్తాడు, వాడే ఈశ్వరుడు. కొంతమంది మంచివారి మధ్య ఉంటారు. ఇంట్లో వారు అందరూ మంచివారే కాని ఎప్పుడూ ఏడుస్తూ ఉంటారు. మంచివారి మధ్య ఉన్నారు, ఈ ఏడుపు ఏమిటి అంటే అదొక ప్రారబ్దం. జన్మాంతరంలో ఉన్న ప్రారబ్దం ఇలా ఏడుపు తీసుకొని వస్తుంది, కారణం మన కళ్ళకు

కనిపించకపోవచ్చు, ఆ ఏడుపుకు ఏదో కారణం ఉంటుంది, లేకపోతే ఏడుపురాదు. పెద్ద విషయాలు తరువాత చూద్దాము ముందు మీ కళ్లలో దోషం లేకుండా చూసుకోండి, చెవులలో దోషం లేకుండా చూసుకోండి అని పరమాత్మ చెపుతున్నాడు. నేను మిమ్మల్ని చూస్తున్నాను అనుకోండి, నా చూపు పవిత్రంగా ఉండాలి, చల్లగా ఉండాలి, అగ్నిని నీరు ఏవిధంగా అయితే ఆర్పేస్తుందో అలాగ నా చూపు మీ దుఃఖాన్ని ఆర్పివేయాలి. నేను మిమ్మల్ని చూస్తూ ఉంటే నా చూపులో ప్రేమలేదు అనుకోండి, మీరు బాగుపడాలనే కాంక్ష లేదు అనుకోండి, నా చూపు వలన మీకు చల్లదనం కలగటం లేదు అనుకోండి నా కళ్లలో ఏదో దోషం ఉంది అని అర్థం. ముందు అది పోగొట్టుకో అని పరమాత్మ చెపుతున్నాడు. చెవిలో ఉన్న దోషం ఏమిటి అంటే కొంతమంది మంచి వినరు, ఎంతసేపు చెడ్డ వినటం కోసం కనిపెట్టుకొని ఉంటారు. ఎవరైనా బాగుపడ్డారు అని చెప్పటం కంటే వారు పాడైపోయారు అంటే ముందు వీడికి సంతోషం వచ్చేస్తుంది. మనస్సులో కూడా ఇతరుల మంచిని కోరుకోరు, ఎంతసేపు చెడుమాటలు ఎవరు చెపుతారా అని చూస్తారు, ఇంట్లో ఎవరూ చెడుమాటలు చెప్పకపోతే వారు రోడ్డుమీద పడిపోతారు, అదొక దురద. నువ్వు సాధన తరువాత చేద్దువుగాని ముందు ఈ చెవిలో ఉన్న దురదను తగ్గించుకో అంటున్నాడు శివుడు. కొంతమంది చూపులోనే రుసరుసమంటూ ఉంటారు. అందుచేత కళ్లలో ఉన్న దోషం, చెవిలో ఉన్న దోషం ముందు ఈ దోషాలను తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఆ దోషాలను తొలగించుకోకపోతే కర్మచక్రంలో తిరుగుతూ ఉంటావు, అందులో నుండి ఒడ్డుకు వచ్చే సమస్యే లేదు. ఆ దోషాలను సరిచేయాలంటే సత్పురుషులు సరిచేయాలి, గురువు సరిచేయాలి. రాగద్వేషముల వలన మనకు కలిసి వచ్చేది ఏమీ లేదు. ఉదాసీనంగా ఉండటం నేర్చుకొంటే మనం పవిత్రులం అవుతాము. బాహ్యంగా అన్నీ విడిచిపెట్టి వెళ్లిపోతే రాగం పోదు, లోపల మనస్సులో పోవాలి. రాగద్వేషాలను తగ్గించుకోకపోతే మనస్సు బాహ్యముఖానికి వెళ్లిపోతూ ఉంటుంది, అశాంతిని, బంధాన్ని పోగుచేసుకొంటుంది. రాగద్వేషాల నుండి విడుదల పొందితే నీ మనస్సే నీకు మోక్షానికి దారి చూపిస్తుంది. ఆత్మ జ్ఞానాన్ని పొందటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు సాధనలో పడిపోతావు అనుకో అక్కడ ఆగిపోవద్దు మరల లెగిసి ప్రయాణం చెయ్యి, గమ్యాన్ని దృష్టిలో పెట్టుకో, ఆత్మవిశ్వాసం పెంచుకో. సాధన ఎలా ఉంటుందో తెలియనివారు సాధనచేసి పడిపోయిన వారిని ఆక్షేపిస్తున్నారు. వారు సాధన చేసి పడిపోయారు అసలు వీరు సాధన చేస్తే కదా పడిపోవటానికి. అసలు నడకే చేతకానివాడు ఏమి పడిపోతాడు. ఎందులోను అతిగా ఉండవద్దు. దాని వలన కొత్త వాసనలు వస్తాయి. అజ్ఞానంలో నుండి బయటపడటానికి ప్రయత్నించు. లేనిపోని గొడవలు

అన్నీ నెత్తిమీద పెట్టుకొని బంధంలో పడవద్దు, జననమరణ చక్రంలో కొట్టుకొని పోవద్దు. మీకు అర్థమవ్వటం కోసం చిన్న ఉదాహరణ చెపుతాను. నాకు ఆస్తులు లేకపోయినా, అధికారం లేకపోయినా, బంధువులు స్నేహితులు అండ లేకపోయినా ఆ రోడ్డు మీద ఉన్న గడ్డిపరక నాది అనుకొంటే పునర్మజన్మ వచ్చి తీరుతుంది. పోనీ ఆ మేడ నాది, బంగారం నాది అనుకొంటే పునర్జన్మ వస్తే సరి, అంత దూరం వరకు వెళ్ళవద్దు, ఆ గడ్డిపరకనాది అనే చిన్న తలంపు కూడా నీకు పునర్జన్మను తీసుకొని వస్తుంది. అది కర్మ సిద్ధాంతం. అందులో రాజీ పడటానికి అవకాశం లేదు. పెద్ద పెద్ద విషయాలు వదిలేయండి, గడ్డిపరక నాది అనే చిన్న తలంపు ఉన్నప్పుడు నాకు పునర్జన్మ రాకుండా మీరు ఆపుచేయలేరు. మీకు ఐశ్వర్యం ఉంటే ఉండవచ్చు. అస్తమాను నాది నాది అని అనుకోకండి, అది ఈశ్వరుడిదే. మీ ప్రారబ్దాన్ని బట్టి అది మీకు కేటాయించాడు అంతే. జీవుడిని మరల శరీరంలోనికి తీసుకొని రావటానికి నాది అనే చిన్న తలంపు సరిపోతుంది. అదే ఉపనిషత్‌లో చెపుతాడు. నువ్వు అన్నం తినేటప్పుడు అన్నానికి నమస్కారం పెట్టుకొని తిను. మనకు ప్రాణశక్తిని ఇచ్చేది, దేహాన్ని పోషించేది అన్నం. అన్నాన్ని ఇష్టంగా తిను, అయిష్టంగా తినకు. చిందరవందరగా అటు ఇటు విసిరేయకు, అన్నం కూడా దేవునితో సమానము. అది దేవుడిదే అని భావన చేసి తిను, అది ప్రసాదమవుతుంది.

కుచేలుడు చిన్నప్పటి నుండి చాలా దారిద్ర్యం అనుభవించాడు. దారిద్ర్యం భరించటం సామాన్యం కాదు, అది చాలా కష్టం. కొంతమంది ఇంటి దగ్గర దారిద్ర్యంతో బాధపడుతూ ఉంటే కనిపించిన వారినల్ల పట్టుకొని తిడుతూ ఉంటారు. పాపం ఆకలిబాధ అటువంటిది. కుచేలుడి దగ్గర గొప్పతనం ఎక్కడ ఉంది అంటే అంత దారిద్ర్యంతో బాధపడుతూ కూడా నన్ను ఎందుకింత దారిద్ర్యంలో పడేశావు అని ఈశ్వరుడిని తిట్టలేదు, స్నేహితులను తిట్టలేదు, బంధువులను తిట్టలేదు. ఆ దారిద్ర్యాన్ని చల్లగా, శాంతిగా అనుభవించాడు. దారిద్ర్యంలో ఉన్నప్పటికీ మనస్సుకు ప్రకోపం లేకుండా, ఉద్రేకం లేకుండా చూసుకొన్నాడు, వాడు కుచేలుడు. ఇంత దారిద్ర్యం అనుభవిస్తున్నాము, బాల్య స్నేహితుడు కృష్ణుడు ఉన్నాడు, ఆయన ప్రభువు, ఆయనను సహాయం అడుగుదాము అని ఆయనకు ఎప్పుడూ అనిపించలేదు. కుచేలుడికి దారిద్ర్యం అనుభవించే ప్రణాళిక ముగిసిపోయింది. భగవంతుడి ప్రణాళిక ఎలా ఉంటుందో చూడండి. నువ్వు ఇంతకాలం నుండి దారిద్ర్యం అనుభవిస్తున్నావు, నీ చిన్ననాటి స్నేహితుడు కృష్ణుడు ఉన్నాడు, ఐశ్వర్యవంతుడు, ఆయనను సహాయం అడగవచ్చు కదా అని కుచేలుడి భార్యతో అనిపిస్తాడు. ఆమాట చెప్పించింది ఈశ్వరుడే. అప్పుడు కూడా కృష్ణుడిని సహాయం అడగాలని కుచేలుడు అనుకోలేదు. కృష్ణుడి దగ్గరకు వెళ్ళమంటోంది. ఆ వంపు పెట్టుకొని

కృష్ణుడు దర్శనం చేసుకోవచ్చు అనుకొన్నాడు, అంతేగాని డబ్బులు కోసం వెళ్ల లేదు. వాడు కుచేలుడు.

బాహ్యమైన సంపదలు ఎన్ని ఉన్నా నీ మనస్సులో శాంతి లేనప్పడు నువ్వు సుఖాన్ని పొందలేవు. శాంతి లేనివాడికి సుఖం ఎక్కడ నుండి వస్తుంది. నీకు ఎప్పడయితే శాంతచిత్తం కలిగిందో, నీ లోపల బండెడు దుఃఖం ఉన్నా ఆ దుఃఖం అంతా ఆనందంగా మారిపోతుంది. మనం కృత్రిమ గౌరవాలకు అలవాటుపడ్డాము. మీరు ఎక్కడయినా నుయ్యి తవ్వించారు అనుకోండి ఫలానా సుబ్బమ్మగారు నుయ్యి తవ్వించారు అని పేపరులో పడకపోయినా మీకు వచ్చే నష్టం ఏమీ లేదు. మీరు నుయ్యి తవ్వించటం సర్వసాక్షి ఈశ్వరుడు చూసాడు కదా. మీకు పుణ్యం కావలిస్తే ఆయన ఇస్తాడు. మీరు చేసిన పని మీరే పేపరులో చూసుకొని సంతోషించటం ఏమిటి? ఈ కృత్రిమ గౌరవాలలో నుండి వేరుపడకపోతే, ఈ దేహగతమైన నేనులో నుండి విడుదల పొందకపోతే ఎంత గౌరవం ఉన్నా ప్రయోజనం ఏముంది, ఆ గౌరవం ఎప్పటికయినా మీకు దుఃఖాన్ని తెచ్చిపెడుతుంది. సోదర మహాశయులారా! మీ దేహము మీరు కాదని తెలిసినప్పడు మిమ్మల్ని స్తోత్రం చేసేవాడి దేహం వాడని మీరు ఎలా అనుకొంటారు? మిమ్మల్ని విమర్శించేవాడి దేహం వాడని మీరు ఎలా అనుకొంటారు? మీ దేహం మీరు కానప్పడు వారి దేహాలు వాళ్ళు ఎలా అవుతారు. అందుచేత సుఖంకోసం ఆత్మ మీద ఆధారపడాలి కాని అనాత్మమీద ఆధారపడకూడదు. ఒకవేళ మనం సుఖం కోసం జడం మీద ఆధారపడితే అందులో తాత్కాలికంగా సుఖం ఉన్నట్లు మీకు అనిపించినా భవిష్యత్‌లో మీరు అనుభవించిన సుఖం అంతా దుఃఖం కిందమారిపోతుంది. నా బుద్ధి బాగాలేదు, నా బుద్ధి బాగాలేదు అంటే నీ బుద్ధి బాగుపడదు. అసలు నీవు లోపల శాంతిగా ఉంటే, ఆనందంగా ఉంటే నీ బుద్ధి బాగుపడుతుంది, బుద్ధి స్థిరపడుతుంది. పరమేశ్వరుడు అగ్రాహ్యుడు అంటే నీ మనస్సుచేత, ఇంద్రియాలచేత, బుద్ధిచేత గ్రహింపబడటానికి వీలు లేనివాడు, వాడే ఈశ్వరుడు. మనస్సు ఎక్కడయితే అణిగిందో అక్కడ ఆయన గ్రహింప బడతాడు. మనం జపధ్యానములు చేస్తూ ఉంటే, సత్కర్మ చేస్తూఉంటే, సత్కర్మ కూడా నిష్కామంగా చేస్తూఉంటే, లోపల పవిత్రత సంపాదించుకొంటే గ్రహించటానికి సాధ్యం కానివాడు కూడా నీకున్న పవిత్రత వలన, ఆయన దయవలన నీకు ఆయన గ్రాహ్యంలోనికి వస్తాడు, గోచరం కానివాడు నీకు గోచరం అవుతాడు. మా మనస్సు నిలబడటం లేదు అని కొంతమంది అంటూ ఉంటారు. దానికి కారణం ఏమిటి అంటే మీ మనస్సులో పవిత్రత లేదు అని అర్థం.

గౌతమబుద్ధుడు ఇంక కొద్దిటైములో చనిపోతాడు అనగా ఏదో ప్రశ్నించాలి అని

ఒకడు బుద్ధుడి దగ్గరకు వస్తాడు. ఇది అడిగే టైము కాదు వెళ్ళిపొమ్మని బుద్ధుడి తమ్ముడు అతనికి చెపుతాడు. ఆ మాటలు బుద్ధుడి చెవిలో పడ్డాయి. ఆయన ప్రేమ చూడండి. వాడు ఏదో అడగాలని వచ్చాడు, దగ్గరకు రానియ్యి అని చెపుతాడు. మనకు ప్రాణం పోయేటప్పుడు చాలా చిరాకుగా, విసుగ్గా ఉంటుంది. కాని ఆయన అప్పుడు కూడా బోధే. మీరు నిర్వాణ సుఖం పొందారా అని బుద్ధుడుని అడుగుతాడు. నిర్వాణసుఖం పొందినవాడికి నేను నిర్వాణసుఖం పొందాను అని చెప్పేవాడు ఎవ్వడూ అక్కడ ఉండడే. ఆ చెప్పేవాడు లోపల ఉంటే వాడు నిర్వాణసుఖం పొందలేదు అని అర్థం అని చెపుతూ బుద్ధుడు ఒక మంచి మాట చెప్పాడు. ఇతరులు పొందితే ఏమిటి? పొందకపోతే ఏమిటి? నీ ఆధ్యాత్మిక అభివృద్ధి ఏమిటో నీవు చూసుకో. నీవు బాగుపడే విధానం చూసుకో. బ్యాంకులో కోట్ల రూపాయలు ఉంటే ఏమి సుఖం నీ జేబులో రూపాయి లేనప్పుడు. నువ్వు సర్వవిధములుగా ప్రయత్నం చేసి ప్రేమపూరితంగా, జ్ఞానపూరితంగా, వివేకపూరితంగా జీవిస్తూ నువ్వు పొందవలసింది ఏదో పొందు. నువ్వు వైరాగ్యంగా ఉండు, వివేకంగా ఉండు అని చెపుతున్నాను. నీవు నిర్వాణ సుఖం పొందాకమటుకు నేను సాధన చేసాను, నేను వైరాగ్యంగా ఉన్నాను, వివేకంగా బతికాను అనే తలంపులు కూడా నీకు ఉండవు. ఒకప్పుడు వాటిని నీవు మోసిన ఇప్పుడు ఇంక వాటి స్పృహ నీకు ఉండదు, అదీ నిర్వాణసుఖం అంటాడు బుద్ధుడు. నువ్వు పెద్ద కష్టపడిపోనక్కరలేదు, పైసాలు ఖర్చుపెట్టనక్కరలేదు, యజ్ఞయాగాలు చేయనక్కరలేదు, నా నామాన్ని స్మరించుకో నీవు పవిత్రుడవైపోతావు. ఎవడైతే పరమపవిత్రుడో వాడి నామాన్ని స్మరిస్తూ ఉంటే నువ్వు పవిత్రుడవు అవ్వకుండా ఎలా ఉంటావు. పవిత్రుడవు అయిన తరువాత నీకు స్థిరబుద్ధి వస్తుంది, ఆ స్థిరబుద్ధికి వస్తువు గోచరిస్తుంది. కుచేలుడి దగ్గర గొప్పతనం ఏమిటి అంటే ఆయన ఎంత దారిద్ర్యం అనుభవిస్తున్నప్పటికీ మనస్సులో వికారం రాలేదు. పరమాత్మ తనకు స్నేహితుడై ఉండి, పరమాత్మ హృదయంతో అంత సన్నిహితంగా ఉన్నప్పటికీ పరమాత్మను ఐశ్వర్యం అడగాలనే తలంపు ఆయనకు రాలేదు. పరమాత్మ దగ్గరకు వెళ్ళి ఐశ్వర్యం అడగమని భార్య చెపుతుంది, ఆయన పరమాత్మను చూడగానే ఐశ్వర్యం అడగాలనే తలంపు కూడా పోయింది, అది కుచేలుడి గొప్పతనం. ఆయన పరమ పవిత్రుడు. నువ్వు ప్రకృతి చుట్టూ తిరుగుతూ ఉంటే నీకు ఆత్మసుఖం దొరకదు. నీవు ప్రకృతిలో సంబంధం తగ్గించుకోవాలి. చైతన్యంతో అనుబంధం పెంచుకోవాలి. జడభావన తగ్గించుకోవాలి, చైతన్య భావన పెంచుకోవాలి. అప్పుడు ఆత్మసుఖం నిన్ను వరిస్తుంది అని పరమాత్మ చెపుతున్నాడు. మీ చుట్టాలు, స్నేహితులు మీకు పది రూపాయలు సహాయం చేయవచ్చు, మీరు ఇబ్బంది పడుతూ ఉంటే నాలుగు చీరలు కొని ఇవ్వవచ్చు,మీ పిల్లలకు చదువు చెప్పించవచ్చు. కాని

మీకు లోపల సుఖం లేకపోతే, శాంతి లేకపోతే వారు సుఖాన్ని, శాంతిని ఇవ్వలేరు. అది గురువుకే సాధ్యం. శాంతి, ఆనందం నీ హృదయంలో నీకు దొరకకపోతే అది ఎక్కడో దొరుకుతుందని ఎప్పుడూ ఆశించవద్దు. శాంతి స్థానం, ఆనంద స్థానం నీ హృదయంలోనే ఉంది. నీ హృదయంలో వెదుకు, అది దొరుకుతుంది. ఇక్కడ దొరకలేదని ప్రకృతిలో వెదకవద్దు. హృదయంలోనే వెదుకుతూ ఉంటే అక్కడ ఉంది కాబట్టి ఈ రోజుకాకపోతే రేపు అయిన దొరుకుతుంది. నాకు మంచిస్నేహాలు దొరకటం లేదు అని ఒకడు బుద్ధుడిని అడుగుతాడు. అసలు నీలో మంచి ఉంటే మంచి స్నేహాలుదొరుకుతాయి. మంచి స్నేహాలు చేయాలనే తలంపు అసలు నీకు ఉంటేకదా. ఈ రోజు రాత్రి ఎంతకాలం జాగరణ ఉండగలిగితే అంతకాలం శివస్మరణతో ఉండి శివానుగ్రహానికి పాత్రులు అవ్వండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-01-06, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కర్తురాజ్ఞయాలో కర్త అంటే ఈశ్వరుడు. మనకు ఎంత అధికారం ఉన్నా, ఎంత ధనం ఉన్నా, ఎన్ని డిగ్రీలు ఉన్నా, బాహ్యంగా ఎన్ని ఉన్నా కూడా మనం బొమ్మలం మాత్రమే. ఈశ్వరుని యొక్క ఆజ్ఞ జరుగుతుంది. మీకు ఏదైనా మంచి జరిగింది అనుకోండి మీ తెలివితేటలు అని మీరు అనుకొంటారు. ఈశ్వరసంకల్పం ప్రకారం అలా జరగవలసి ఉంది, జరిగింది అంతే. శుభం జరిగినా అశుభం జరిగినా కూడా అంతే. మీరు ఒకసారి పెద్ద ఘనకార్యం చేయవచ్చు, ఫలితం చిన్నది రావచ్చు. ఒకోసారి చిన్నపని చేయవచ్చు, ఫలితం పెద్దగా రావచ్చు. ఎందుచేతనంటే జడవస్తువుకు ఫలితాన్ని నిర్ణయించే శక్తి లేదు. ఫలితాన్ని నిర్ణయించేవాడు ఈశ్వరుడు, అది కర్తురాజ్ఞయా. సృష్టిలో జీవకోటికి ఈశ్వరుని యొక్క ఆజ్ఞ లేకుండా ఎక్కడా ఏదీ జరగటానికి వీలులేదు, జరుగదు. మన జీవితాలు తెగిపోయిన గాలిపటాలలాగ లేవు. ఎప్పడు ఎక్కడ ఉండాలో, మన ముక్కులో గాలి ఎప్పడు బయటకు పోవాలో అన్నీ కరెక్టుగా నిర్ణయింపబడే మనలను భూమి మీదకు పంపుతాడు. తల్లి కడుపులో నుండి బయటకు వచ్చినప్పడే నీవు ఏ పని చేయాలో నిర్ణయింపబడుతుంది. మన దేహ ప్రారబ్ధాన్ని బట్టి భగవంతుడు పరిస్థితులను అలా అలా గెంటుకుంటూ వస్తాడు, నీ తెలివితేటల వలన ఏమీ అవ్వదు, అది మీరు గుర్తు పెట్టుకోండి, అంతా ఈశ్వరుని ఆజ్ఞ ప్రకారమే జరుగుతుంది, అదే కర్తురాజ్ఞయా. రాష్ట్రపతి పదవికోసం ప్రయత్నం చేసి ఏ పదవి లేకుండా ఉన్నవారు ఉన్నారు. ఏ కోరిక లేకుండా పెద్ద ప్రయత్నం లేకుండా రాష్ట్రపతి అయిన వారు ఉన్నారు. ఇప్పడు ప్రధానమంత్రి పదవికోసం ప్రయత్నం చేసి ఫెయిల్ అయ్యావు అనుకో, ఎందుచేతనంటే కర్త యొక్క ఆజ్ఞ లేదు కాబట్టి నీవు ప్రయత్నం చేసిన ఫెయిల్ అవుతావు.

ఒకోసారి నీవు చిన్న ప్రయత్నం చేసినా సక్సెస్ అవుతావు. ఈశ్వరుని యొక్క ఆజ్ఞ ఉంది కాబట్టి అక్కడ నీకు ఆ ఫలితం వచ్చింది కాని కేవలం నీ ప్రయత్నం వలన రాలేదు అది నీవు గుర్తుపెట్టుకో. 'కర్తురాజ్ఞయా ప్రాప్యతేఫలం కర్మకింపరం కర్మతజ్జడం' ఈ ఒక్క శ్లోకం మీకు గుర్తు ఉంటే చాలు. ఈ శ్లోకం అర్థమయితే మీ మనస్సు శాంతిగా ఉంటుంది, జీవుడిలో ఉన్న అహంకారం తగ్గుతూ ఉంటుంది.

మీ ఇంటిలో ఏదైనా మంచి జరిగితే మీరు ఎంజాయ్ చేస్తున్నారు. మీ పిల్లలకు చదువు బాగా వచ్చినా, ఉద్యోగాలు వచ్చినా, మీకు ఏదైనా అధికారం వచ్చినా, మీరు అనుకొన్న పనులు అన్నీ అయిపోయినా మీకు ఎంతో సంతోషం వచ్చేస్తుంది, మిమ్మల్ని ఎవరూ పట్టుకోలేరు, పాయసం నోట్లో పోసుకొన్నట్లు మీరు వాటిని ఎంజాయ్ చేస్తున్నారు. మిమ్మల్ని ఒక మాట అడుగుతున్నాను, గుండెల మీద చేయి వేసుకొని చెప్పండి. మీరు ఎప్పుడయినా భగవంతుడిని ఎంజాయ్ చేసారా? మీరు భక్తులే, మీకు ఎంతో కొంత భక్తి ఉంది, జిజ్ఞాస ఉంది కాబట్టి ఇక్కడకు వచ్చారు. మీరు బాహ్యపరిస్థితులను ఎంజాయ్ చేస్తున్నారు గాని భగవంతుడిని ఎప్పుడయినా ఎంజాయ్ చేసారా? కొండగుహలలో సింహం ఉంది, అది మృగరాజు. హృదయగుహలో ఈశ్వరుడు ఉన్నాడు, ఆయన జీవకోటికి రాజు, ఆయనే ప్రభువు. భగవంతుడు జ్ఞాపకం వచ్చినప్పుడు కాని, భగవంతుడిని స్మరించుకొన్నప్పుడు కాని మీరు ఈశ్వరుడితో అనుబంధాన్ని ఎప్పుడైనా ఎంజాయ్ చేసారా? ఒకటి గుర్తు పెట్టుకోండి. మన ముక్కులో గాలిపోయిన వెంటనే మన బంధువులతోటి, స్నేహితులతోటి, పరిసరాలతోటి సంబంధం పూర్తిగా తెగిపోతుంది ఒక్క ఈశ్వరుడితో అనుబంధం అలా కంటిన్యూ అవుతుంది. తాత్కాలికంగా మెరిసే విషయాలను ఎంజాయ్ చేస్తున్నాము, ఎప్పుడూ మన కూడా ఉండే వాటిని వదిలేస్తున్నాము. వంద సంవత్సరాలు బతికితే ఒక్క క్షణం కూడా భగవంతుడిని ఎంజాయ్ చేయటం లేదు. మీరు జీవించండి, ఇది అంతా స్వప్నం అనుకొని జీవించండి, భగవంతుడిని ఎంజాయ్ చేయండి. మనస్సు, ప్రాణం ఆత్మకు నీడలలాగ ఉంటాయి. మనం ప్రయత్నం చేసి మనోనాశనము చేసుకొంటే హృదయంలో ఉన్న ఆత్మ మనకు వ్యక్తమవుతుంది. అదే నీ కడసారి జన్మ. చైతన్యం మన హృదయంలో ఉంది, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటమే గమ్యంగా పెట్టుకోవాలి. ప్రారబ్ధాన్ని బట్టి మన జీవితం జరుగుతూ ఉంటుంది, మనం దానితో తాదాత్మ్యం పొందకుండా చైతన్యానుభవం పొందటానికి ప్రయత్నం చేయాలి. మన మాట, చేత, ఆలోచన దానికి అనుగుణంగా ఉండాలి. బంగారు పళ్లెం అయినా నిలబడటానికి గోడ సపోర్టుగా ఉండాలి. అదేవిధంగా నీ ప్రయత్నాలు నీవు చేస్తూ సద్గుణాలను సపోర్టుగా పెట్టుకోవాలి. సద్గుణాలు లేకుండా జ్ఞానం సంపాదించాలనే కోరిక రాదు. చంటి

పిల్లలను ఎంత జాగ్రత్తగా చూసుకొంటామో అంత జాగ్రత్తగా సద్గుణాలను పోషించుకొంటూ రావాలి. మీ ఇంటి దగ్గర ఏదైనా మంచి జరుగుతోంది అనుకోండి మా తెలివి వలన జరుగుతోంది, మా పూర్వజన్మ సుకృతం వలన జరుగుతోంది అని అనుకోవద్దు. అది కర్త యొక్క ఆజ్ఞ ప్రకారం జరుగుతోంది అని గ్రహించి మీరు భగవంతుడిని ఎంజాయ్ చేయండి.

మన బుద్ధి మంచిది కాదు. మీ అమ్మాయికి 10 రూపాయలు ఇస్తే అది దానం అనుకోవటం లేదు. ఏ సంస్థకో, ఇతరులకో ఇస్తే దానం అనుకొంటున్నారు. మీ అమ్మాయి మీద ప్రేమ ఉంది కాబట్టి అది దానం అనిపించటం లేదు. ప్రేమ ఉన్నచోట దానం అనే మాట గుర్తుకురాదు. నీకు ప్రేమ లేనిచోట దానాలు, గొప్పలు, ఊరేగింపులు ఈ గొడవలు, అల్లరి అంతా. మన బుద్ధి సరిగా లేకపోవటం వలన ఈ గొడవ అంతా. నీ ఇష్టాలను ప్రక్కన పెట్టి భగవంతుని ప్రీత్యర్థం ఆయన అనుగ్రహం పొందటం కోసం నీవు పనిచేస్తూ ఉంటే కొంతకాలానికి మీకు చిత్తశుద్ధి కలుగుతుంది, ఎప్పుడయితే చిత్తశుద్ధి కలిగిందో లోపల ఉన్న నేను మీకు వ్యక్తమవుతాను అని పరమాత్మ చెపుతున్నాడు. వాళ్ళకు అది చేసాము, వీళ్ళకు ఇది చేసాము అంటే ప్రేమ ఉంటే ఇటువంటి మాటలు రావు, ప్రేమ ఉంటే ఇవి అన్నీ మర్చిపోతాము. నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడిని అనుభవైకవేద్యం చేసుకోవటమే ఆదర్శంగా పెట్టుకో, లౌకికమైన గొడవలు వద్దు. శరీరం చనిపోయిన తరువాత మాకు జన్మ ఉంటుందా అని భగవాన్‌ను అడుగుతున్నారు. అజ్ఞానం ఉన్నంతవరకు పునర్జన్మ ఉంటుంది. దుఃఖ కారణం మీలోపలే ఉంది, దానిని కత్తిరిస్తే దుఃఖం అంటూ లేదు. ఇతరులు ప్రయత్నం చేసినా మీకు దుఃఖాన్ని తీసుకొని రాలేరు. ఎందుచేతనంటే దుఃఖకారణం పోయింది కాబట్టి. అజ్ఞానం అనే నిద్రలో ఈ చావులు, పుట్టుకలు వెళ్ళిపోతాయి. అజ్ఞానం అనే నిద్ర నుండి మేల్కొలపటం ఒక్క గురువుకే సాధ్యం. మన దేహం ఎంత నిజమో మన బంధువులు, స్నేహితులు, సంపదలు, జయాపజయాలు అంతే నిజం. బ్రహ్మపదార్థం ఎరుకలోనికి వచ్చాక ఇవిఅన్నీ అసత్యం అని, ఇది అంతా డస్టు అని నీకు తెలుస్తుంది. తెలివైన వారందరూ మేము తెలివైన వాళ్ళం అనుకొంటారు. భగవంతుడి ముందు నీ తెలివి ఎంత? నీ ఐశ్వర్యం ఎంత? నువ్వు ఎంత? నా పూర్వజన్మల గురించి తెలుసుకోవచ్చునా అని అడుగుతున్నాడు. పూర్వజన్మల గొడవ ఎందుకయ్యా, అవి అన్నీ అబద్దాలు, అవి వ్యవహారిక సత్యాలు. నువ్వు కష్టపడి, కష్టపడి సత్యాన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తావా? అబద్ధం తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తావా? ఒక గోతిలో నుండి బయటకు వచ్చి ఇంకో గోతిలో పడతావా? ఈ జన్మ అసత్యం, ఈ శరీరం అసత్యం ఇంక పూర్వజన్మల గొడవ ఎందుకు? వర్తమానకాలాన్ని పాడుచేసుకోవద్దు. ఈ జన్మలో గొడవలే పడలేకపోతున్నాము, ఇంక పూర్వజన్మల గొడవ

ఎందుకు? భగవంతుడు దయామయుడు కాబట్టి నీకు మరుపు పెట్టాడు. అవి అన్నీ జ్ఞాపకం ఉంటే ఆ అశాంతి యొక్క వేగాన్ని నీవు తట్టుకోలేవు. నీపట్ల కరుణ వలన భగవంతుడు మరుపుపెట్టాడు.

అరుణాచలేశ్వరుడు మన హృదయంలో ఉన్నాడు. నీకు స్ఫురించటానికి సిద్ధంగా ఉన్నాడు. అది మర్చిపోవద్దు. మనందరం చేసే పొరపాటు ఏమిటి అంటే ఏదో కావాలి అని అడుగుతాము కాని ఆయన కావాలి అని కోరుకోము. చదువు, డబ్బు, గౌరవం, అధికారం ఇలా ఎవడి పిచ్చిని బట్టి వాడు అడుగుతాడు. కోరికలు నెరవేరితే మన కొంపలు మునిగి పోతాయి అని కూడా మనకు తెలియటం లేదు. మనకు ఏది మంచిదో మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు అని మనకు తెలియటం లేదు. మనం భగవంతుడిని అది కావాలి, ఇది కావాలి అని అడిగితే ఇచ్చేసి, వీళ్ల గొడవ వదిలింది అనుకొంటాడు. నువ్వే కావాలి అంటాము అనుకోండి వీళ్ళు నన్నే అడుగుతున్నారు, సిద్ధమయిపోతున్నారు అని వాడు కూడా రెడీ అయిపోతాడు. మనం రెడీ అయితే కొన్ని క్షణాలలో హృదయంలో ఉన్న వస్తువు మనకు ఎరుకలోనికి వస్తుంది. అక్కడ నుండి ఆనందమే ఆనందం, శాంతే శాంతి. మనం గాలి పీల్చుకొంటున్నాము, స్నానం చేస్తున్నాము, అన్నం తింటున్నాము, ఇవి అన్నీ నార్మల్‌గా చేస్తున్నాము. ఇవి చేసేటప్పుడు ఏవో గొప్ప పనులు చేస్తున్నాము అని మనం అనుకోము. అలాగే మనం చేసే మంచి పనులు కూడా నార్మల్‌గా, నేచురల్‌గా చేయాలి. చేసే పనులు నార్మల్‌గా చేయము అనుకోండి, గొప్పపనులు చేస్తున్నాము అని అనుకొంటున్నాము అనుకోండి అలా అనుకొని మంచిపనులు చేయటం కంటే మానివేయటం మంచిది. అలా అనుకొంటూ చేయటం వలన లోపల మానసిక వ్యాపారం పెరిగిపోతుంది, అది కొన్ని వేల జన్మలకు కారణం అవుతుంది. మీరు చేసిన మంచిపని మనస్సులో పదిసార్లు అనుకొంటారు అనుకోండి, దానివలన మానసిక వ్యాపారం పెరిగిపోతుంది. మానసిక వ్యాపారం లేకపోతే పునర్జన్మ హేతువులు ఉండవు. వాసనా క్షయం కూడా మీరు అనుకొన్నంత తేలికకాదు. చేతికి జిడ్డు అంటుకొంటే అది పోయేవరకు తోముతూనే ఉంటాము. జిడ్డు పోయే వరకు ఎలా తోముతామో అలాగ గత జన్మల నుండి వస్తున్న వాసనలను తోముతూ ఉండాలి. లేకపోతే వాసన నశించదు. వాసనలు పూర్తిగా నశించకపోతే ఈలోపు మీరు సాధన చేసేటప్పుడు ఆయన దయవలన ఎప్పుడైనా ఈశ్వరుడు మీకు స్ఫురించవచ్చు, మీకు శాంతి కలుగవచ్చు, ఒడ్డుకు వచ్చేసాము అని అనుకోవద్దు. మరుక్షణంలో మీ వాసన మిమ్మల్ని లాగుకొనిపోతుంది. ఎప్పుడయినా లోపల ఉన్న వస్తువు మీకు స్ఫురించినా అది నిలబడదు, వాసనాక్షయం పూర్తి అయితేగాని శాశ్వతం అవ్వదు. వాసనా క్షయం అవ్వాలంటే ఎంతో

సాధన చెయ్యాలి. ఉదాహరణకు మీకు రోజూ సినిమాకు వెళ్ళే అలవాటు ఉంది అనుకోండి, అది పోవాలంటే సినిమాకు వెళ్ళనివారితో సహవాసం చెయ్యాలి, సత్పురుషులతో సహవాసం చెయ్యాలి. బుద్ధిమంతులకు, బుద్ధిమంతులు కాని వారికి తేడా ఏమిటి అంటే బుద్ధిమంతులు వారిని వారు సరిచేసుకొంటారు, ఇతరుల గొడవలలోనికి వెళ్ళరు. బుద్ధి లేనివారు వారిని వారు సరిచేసుకోవటం మానేసి ఎవరో ఒకరిమీద అక్షింతలు వేస్తూ ఉంటారు, రోడ్డు మీద ఉన్న దుమ్ము అంతా పోగుచేసుకొంటారు, చివరికి జీవితంలో వారికి మిగిలేది దుమ్మే. చంటి పిల్లలకు చర్మం మృదువుగా ఉండటానికి వెన్న మీగడ ఎలా రాస్తారో అలాగ మీ హృదయం మృదుత్వం పొందటానికి, మనస్సులో ఉన్న మాలిన్యం పోవటానికి, నీవు పవిత్రుడవు అవ్వటానికి యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు.

రూపం, నామం మనలను పీడించుకొని తింటున్నాయి. ఇంతకంటే దరిద్రం ఇంకోటి లేదు. ఎలుకల బోనులో మేత ఎందుకు పెడతాము? అది తింటుంది అని పెట్టము. మేతకోసం వచ్చి బోనులో పడుతుంది, దానిని చంపేద్దాము అని పెడతాము. అలాగే భగవంతుడు ఏమి చేసాడు అంటే రూపబుద్ధి, నామబుద్ధి అనే బోనులో మనలను పడేసాడు. మనం ఎంతసేపు ఈ రెండూ మోసుకొని తిరుగుతూ ఉంటాము. ఇందులో నుండి మనం బయటకు వచ్చేది లేదు, తరించేది లేదు. ఎంతటి వారినైనా ఈ రూపం, నామం పీడించేస్తుంది. మీకు పేరు వస్తుంది అంటేగాని వాడు మంచిపని కూడా చేయడు. రూపబుద్ధి, నామబుద్ధి లేకుండా మనం మంచి పనులు చేస్తే మనకు చిత్తశుద్ధి కలుగుతుంది. ఎల్‌కెజి చదవకుండా నెలకు నాకు లక్ష రూపాయల జీతం రావాలి అనుకోవటం ఎటువంటిదో చిత్తశుద్ధి లేకుండా జ్ఞానం రావాలి అనుకోవటం అటువంటిదే. మీరు లోకాన్ని మోసం చేయవచ్చు గాని అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మోసం చేయలేరు. మాయ అనే బోనులో పడటానికి ఈ రూపబుద్ధి, నామబుద్ధిని భగవంతుడు పెట్టాడు. మనం జాగ్రత్తగా సాధన చేసుకొంటూ, వివేకంగా జీవిస్తూ ఈ బోనులో పడకపోతే ముక్తి, ఆ బోనులో పడితే బంధం. అందరూ పెద్ద పెద్ద సాధకులేగాని అహంభావన అనే గడపను దాటలేకపోతున్నారు. అహంభావన పోతే అప్పుడు శాశ్వతమైన జీవితం ప్రారంభమవుతుంది. అహంభావన పోతే నీవు పోవు, అప్పటి నుండి నిజమైన జీవితం ప్రారంభమవుతుంది అన్నారు భగవాన్. ఇప్పుడు మనం జీవించే జీవితం అంతా దొంగ జీవితం. ఈ శరీరానికి, మనస్సుకు, బుద్ధికి పరిమితమైన జీవితం. అహంభావన ఎప్పుడైతే నశించిందో అప్పుడు అసత్యంలో నుండి బయటకు వస్తావు, అప్పుడు నిజమైన జీవితం ప్రారంభమవుతుంది. నీ రూపబుద్ధి, నామబుద్ధి స్మశానంలోనికి వెళ్ళేవరకు పోదు. ఈ జన్మలోనే కాదు వచ్చే జన్మలో కూడా పోదు. నీవు సత్కర్మ చేయగా

చేయగా, నీ మనస్సును భగవంతుడికి అర్పించి ఆరాధించగా, ఆరాధించగా ఆయన దయ కలిగినప్పడు ఆయన నిన్ను అనుగ్రహిస్తాడు. ఆయన అనుగ్రహం ఉంటే అన్నీ సాధ్యమే, ఆయన అనుగ్రహం లేకపోతే చీపురుపుల్ల కూడా పైకి ఎత్తలేరు.

పూర్వజన్మలో ఎక్కడ ఉన్నాను, రాబోయే జన్మలో ఎక్కడ పుడతాను అంటున్నావు. పూర్వజన్మలో నువ్వు ఉన్నావో లేదో, చచ్చాక నీవు ఏమౌతావో, ఇప్పడు నీవు ఉన్నావు కదా, ఆ ఉన్నవాడు ఎవడో తెలుసుకో. ఇప్పడు ఉన్నవాడు ఎవడో తెలుసుకోకుండా పూర్వజన్మల గురించి, రాబోయే జన్మల గురించి తెలుసుకోవటం వలన నీకు వచ్చే లాభం ఏమిటి? మనం నూటికి నూరుపాళ్ళు ఆనందంలో, శాంతిలో ఉంటే పూర్వజన్మ గొడవ, రాబోయే జన్మ గొడవ, ఈ సృష్టిలో ఉండే విషయాల గురించి ఏమీ అక్కరలేదు. నీలోపలఉన్న అశాంతి, అజ్ఞానం ఇవి అన్నీ వెతుకుతోంది. నీవు ఎంతకాలం అయితే అజ్ఞానంలోనుండి బయటకు రావో అంతకాలం కాని విషయాల వెంటపడి తిరుగుతూఉంటావు. అజ్ఞానంలో నుండి బయటకురావటానికి ప్రయత్నం చేయటంలేదు, అహంభావన కల్పించిన నీడ వెంటపడి వెళుతున్నావు. మిధ్యానేను వలన దమ్మిడి పని అవ్వదు, దానిని చూసి ఎందుకు మురిసి పోతున్నారు. మీరు ఏదైనా అభివృద్ధిలోనికి వస్తే ఆ పని చేసింది ఈశ్వరుడు కాని సంతోషించేది దొంగనేను. ఆ దొంగనేను ఏమైనా సాధించి పెట్టిందా మురిసిపోవటానికి. దొంగనేనుకు సాధ్యం అంటూ ఏమీ లేదు, నిజమైన నేనుకు అసాధ్యం అంటూ ఏమీ లేదు. దొంగనేనును ఒక ప్రక్కన కూర్చోమంటే అది కూర్చోదు, దాని వలన పేచీలు, బేదబుద్ధి వస్తోంది. భగవంతుడి గుణాలను ఎంజాయ్ చేస్తూ ఉంటే మనకు జ్ఞానం వచ్చేస్తుంది. కృష్ణుడి మీద మనకు ద్వేషం వస్తూ ఉంటే ఇంక వాడి గుణాలను మనం ఎలా ఎంజాయ్ చేయగలము. మీరందరూ జ్ఞానానికి వారసులే. ఆయన మీకు తెలియబడటానికి సిద్ధంగా ఉన్నాడు. మీరు తెలుసుకోవటానికి సిద్ధంగా ఉన్నారా అని ఆయన అడుగుతున్నాడు. మీరు సిద్ధంగా లేరు అందుచేత ఆయన తెలియబడటం లేదు. పూర్వజన్మలు, రాబోయే జన్మలు గొడవ వదిలెయ్యి. ఇప్పడు నేను, నేను అంటున్నావు కదా. ఆ నేను ఎవరో నీకు తెలుసా? పునర్జన్మకు నీ దేహం కారణం కాదు, ఈ నేనే పునర్జన్మలకు కారణం, దుఃఖానికి కారణం. ఈ నేను పుట్టినప్పడు నీవు పుట్టావు, ఈ నేను ఎప్పడయితే నశించిందో ఆ రోజు నుండి నీకు శాశ్వతమైన జీవితం ప్రారంభం అవుతుంది. ప్రతీవాడు మేము మంచివాళ్ళం అనుకొంటారు. అక్కడితో సరిపెట్టరు మా తాతగారు మంచివారు, మా కుటుంబం మంచిది అంటారు. వారు మంచివారు అయితే వారికి ఆత్మజ్ఞానం ఎందుకు కలుగలేదు. మనం మంచివారము అని మనం అనుకోవటం కాదు, భగవంతుడు అనుకోవాలి.

మీ బుద్ధిలో ఎన్ని దోషాలు ఉన్నా, ఎన్ని బలహీనతలు ఉన్నా ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే ధృడనిశ్చయం నీకు ఉంటే నిన్ను బాగు చేసే బాధ్యత నాది అని పరమాత్మ చెపుతున్నాడు. భగవంతుడు చెప్పిన మాటను ప్రమాణంగా తీసుకొని భగవంతుడిని చేరుకోవాలి. మనం సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకొంటూ ఉంటే, భగవంతుని పాదాలవైపు జరుగుతూ ఉంటే మనలో బండెడు దుఃఖం ఉన్నా అది అంతా ఆనందంగా మారిపోతుంది. మీకు ఎన్ని అంతస్థులు ఉన్నా, ఎన్ని వైభవాలు ఉన్నా, మీ జీవితాలు ఎంత పచ్చగా ఉన్నా ఆత్మ యొక్క వైభవం, ఆధ్యాత్మిక వైభవం లేకపోతే ఇవి అన్నీ సున్నలు. ఆత్మ యొక్క వైభవం ఉండి ఇవి అన్నీ ఉంటే నీకు ఏమీ నష్టం లేదు. ఇవి అన్నీ ఉండి ఆత్మ యొక్క వైభవం లేదు అనుకో ఒకటి లేని సున్నలతో సమానము. మీరు ఇంటి దగ్గర కూర్చొని ఎవరికి లేని ప్రత్యేకత నాకు ఉండాలి అనుకొంటారు అనుకోండి, అక్కడ నుండి అజ్ఞానం ప్రారంభమవుతుంది. నీవు ఇతరులకు ఇచ్చేది తిరిగి నీకే వస్తుంది అని తెలిస్తే ఇతరులకు ఏమీ ఇవ్వకుండా ఎంతకాలం ఉండగలవు. మీ దగ్గర పది వంకాయలు ఉన్నాయి అనుకోండి. ఇతరులకు ఇచ్చేటప్పుడు ఆ పది వంకాయలలో మంచివి ఇవ్వండి. దానికి ఈశ్వరుడు పొంగిపోతాడు. ఆ వంకాయలు తినే వాడిలో కూడా ఈశ్వరుడు ఉన్నాడు అది మర్చిపోవద్దు. ఈ చిన్న చిన్న పనులు చేయండి, మీకు మోక్షం వచ్చేస్తుంది. ఎందుచేతనంటే భగవంతుని దృష్టిలో చిన్నపనా, పెద్దపనా అని లేదు. లోపల ఏ సంకల్పంతో చేస్తున్నాము అది భగవంతుడు చూస్తాడు. అందరి మొఖాలలోను దేవుడినే చూడటం నేర్చుకోండి. వంకాయలు రేపు తిందాము, రేపు తిందాము అనుకొంటారు. ఈ లోపు కుళ్లిపోతాయి. మీకు సరిపోతే తినేయండి. ఎవరికైనా ఇవ్వాలి అనుకొంటే మంచివి తీసి ఇవ్వండి. దానికి ఈశ్వరుడు పొంగిపోతాడు, ఆయన దయతో మిమ్మల్ని కప్పతాడు, వాడు కృష్ణుడు. ఎవరికైనా ఇచ్చేటప్పుడు మనం ఏరి, ఏరి చెడ్డవి ఇస్తాము. ఇదంతా ఈశ్వరుడు చూస్తున్నాడు. నీ శరీరానికి చెడ్డ అనుకొన్నది ఇంకో శరీరానికి మంచి ఎలా అవుతుంది. ఇటువంటి చిన్న చిన్న విషయాలలో జాగ్రత్తగా ఉంటూ, జీవిస్తూ ఉంటే మీకు పవిత్రత కలుగుతుంది, ఆత్మజ్ఞానానికి అర్హత కలుగుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-03-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు ఉగాది, నూతన సంవత్సరం. ఇది వ్యయనామ సంవత్సరం. ఈరోజు ఒకరి క్షేమం ఒకరు కోరుకొంటారు. మనం అందరి క్షేమం కోరుకొంటే మనం క్షేమంగా ఉంటాము. అందరూ శాంతిగా ఉండాలి అనుకొంటే మనం శాంతిగా ఉంటాము. అంతేగాని ఎవరూ శాంతిగా ఉండకూడదు, ఎవరూ సుఖంగా ఉండకూడదు. నేను ఒక్కడినే సుఖంగా,

శాంతిగా ఉండాలి అనుకొంటే కోటిజన్మలు ఎత్తినా నీకు సుఖం దొరకదు, ఒకవేళ కోట్ల రూపాయలు ఉన్నా నీకు సుఖం దొరకదు. ప్రపంచంలో ఏమీ లేదు. మనలో ఉన్నదే ప్రపంచంలో కనిపిస్తుంది. మన నిజమైన ఇల్లు మన హృదయంలోనే ఉంది. మన నిజమైన ఇంటికి మనం చేరుకొంటే పునర్జన్మలు ఆగిపోతాయి. మనం బయట దేవతలను పూజించటం ఎందుకు అంటే వారి అనుగ్రహంతో హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికే మనం చేస్తున్నాము. శివుడికి అభిషేకాలు చేసినా, విష్ణువుకు అలంకరించినా ఇవి అన్నీ కూడా హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికే మనంచేస్తున్నాము. కంచి పరమాచార్యులు అంటే నాకు హృదయంలో ఇష్టం ఉంది, నిరాడంబరంగా ఎలా జీవించాలో ఆయనను చూస్తే తెలుస్తుంది. నిరాడంబరంలోనే సౌందర్యం ఉంది. ఆయన రాత్రి నాకు స్వప్నంలో కనిపించి నా చేతిలో రెండు పండ్లు పెట్టారు. ఆయన పండ్లు ఇస్తున్నందుకు నాకు సంతోషంగా ఉంది కాని తీసుకోవటానికి సంకోచిస్తున్నాను కారణం తెలియదు. ఈ పండ్లు ఏమిటి అనుకొంటున్నావు 1. అందం, 2. సత్యం అన్నారు పరమాచార్య. సత్యమైనది ఎప్పుడూ అందంగానే ఉంటుంది, అందమైనది ఎప్పడూ సత్యంగానే ఉంటుంది. రెండూ ఒక్కటే. అందం వేరు, సత్యం వేరు అనుకోవద్దు. ఒక్కటి అంటే ఒక్కటే, అద్వైతానుభవం. ఆ అనుభవం మనకు కలిగితే పూర్వజన్మలలో ఉన్న కర్మలు అన్నీ కాలిపోతాయి అని చెప్పారు. వర్షాకాలంలో మనం బయట కూర్చుంటే మన నెత్తిమీద వర్షం ఎలా కురుస్తుందో, సత్యానుభవం ఉన్నవాడిని మనం ఆరాధిస్తే మన కోరికలు కూడా అలా నెరవేరతాయి, శాస్త్రం జ్ఞానికి అంత ప్రాముఖ్యత ఇచ్చి చెప్పింది. ప్రారబ్ధాన్ని బట్టి దేహం వస్తుంది. దేహాభిమానం నశించింది అనుకోండి ప్రారబ్ధం కూడా నశిస్తుంది. కాల ప్రవాహంలో పుణ్య ప్రారబ్ధం వస్తూ ఉంటుంది, పాప ప్రారబ్ధం వస్తూ ఉంటుంది. పుణ్య ప్రారబ్ధం సుఖంగా ఉంటుంది, పాప ప్రారబ్ధం కష్టంగా ఉంటుంది. దేహాభిమానం ఉన్నవాడికి ప్రారబ్ధం యొక్క బాధ తెలుస్తుంది, దేహాభిమానం లేనివాడికి ప్రారబ్ధం యొక్క బాధ తెలియదు. భగవంతుడు దయామయుడు అంటున్నారు కదా మరి జీవుడికి పాప ప్రారబ్ధం ఎందుకు పెట్టాడు అంటే మన మీద జాలి లేకకాదు, దయ లేకకాదు, పాపప్రారబ్ధం అనుభవంలోనికి తీసుకొని రావటం కూడా ఆయన దయే అని చెప్పారు. ఎందుచేతనంటే పాపప్రారబ్ధం అనుభవించే వాడికి మనం భవిష్యత్‌లో జాగ్రత్తగా ఉండాలి అని వాడికి తెలుస్తుంది, ధర్మాన్ని ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. ధర్మాన్ని ఆచరించకుండా ధర్మ స్వరూపుడైన ఈశ్వరుడిని మనం పొందలేము. అందుచేత పాప ప్రారబ్ధం కూడా భగవంతుడి దయే, అది కూడా మంచిదే అని చెప్పారు. అది చెడ్డది అని మీరు అనుకోవద్దు. అవగాహన చేసుకొనేశక్తి లేకపోవటం వలన అది చెడ్డకింద మీకు

అనిపిస్తోంది అన్నారు.

వ్యయమంటే ఖర్చు, వ్యయనామ సంవత్సరంలో మనం ఏమి చేయాలి అంటే మన తలంపులను వ్యయం చేస్తున్నాము అనుకోండి అవి మనకు పుణ్యం తీసుకొని రావాలి. మన దగ్గర ఉన్న డబ్బు వ్యయం చేస్తున్నాము అనుకోండి, అది మనకు పుణ్యం తీసుకొని రావాలి. మన ఆలోచన, మాట, చేత, మనం ఏది చేసినా అది మనకు పుణ్యం తీసుకొని రావాలి, అది ఖర్చు అనుకోకండి, అది పుణ్యం కింద మారాలి. నేను బాహ్యంగా మీకు ఏమీ చేయలేక పోయినా మీరు క్షేమంగా ఉండాలి, సుఖంగా ఉండాలి, ఏమీ లోటు లేకుండా ఉండాలి అని నేను సంకల్పం చేస్తాను అనుకోండి, ఆ సంకల్ప ప్రభావం మీ మీద ఉంటుంది, నాకు పుణ్యం వస్తుంది, ఉభయతారకం. బంధంలో నుండి, అజ్ఞానంలో నుండి తేలికగా బయటకు వచ్చే ఉపాయం ఒకటి ఉంది అని పరమాత్మ చెపుతూ నద్వేష్టి, నకాంక్షతి అంటే ఏ వ్యక్తి మీద ద్వేషం పెట్టుకోవద్దు, ఏ వస్తువు మీద కాంక్ష పెట్టుకోవద్దు. మీ ప్రారబ్దంలో రావలసి ఉంటే అది వస్తుంది కాని కాంక్ష పెట్టుకోవద్దు. మీ కోరిక లేకుండా ఏదైనా వస్తే అది మిమ్మల్ని బంధించదు, కోరికతో తెచ్చుకొంటే అది మిమ్మల్ని బంధిస్తుంది. వారు ఎంత చెడ్డవారైనా వారి మీద ద్వేషం పెట్టుకోవద్దు. ద్వేషం పెట్టుకొంటే నీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. దాని వలన నీవు నష్టపోతావు. ద్వేషం లేనివాడు, కాంక్ష లేనివాడు బంధంలో నుండి బహు తేలికగా సుఖంగా బయటకు వస్తాడు.

ఒకరు బాబాగారి దగ్గర ఎవరి గురించో మాట్లాడుతూ ఆయన చాలా ధనవంతుడు అని చెపుతాడు. బాబా ఏమన్నారు అంటే ఆయన కాలాన్ని, శక్తిని పాడుచేసుకొన్నాడు అని చెప్పారు. నీ మనస్సును బాగుచేసుకొంటే మంచిదే. భగవంతుడిని స్మరించగా, స్మరించగా ఆయన దయవలన నీవు పవిత్రుడవు అవుతావు. స్మరించటం వలననే నీవు పవిత్రుడవు అవ్వవు, ఆయన దయవలన నీవు పవిత్రుడవు అవుతావు. ఈ లాజిక్ మీరు అర్థం చేసుకోండి. నీ మనస్సును బాగుచేసుకోకుండా కేవలం డబ్బు సంపాదిస్తూ ఉంటే వాడి టైము వేస్టు, ఎనర్జీ వేస్టు అని చెప్పారు. ఎందుచేతనంటే మరణానంతరం నీ మనస్సు నీకూడా వస్తుంది. నీవు సంపాదించిన డబ్బు నీ కూడా రాదు. నీ శరీరమే నీ కూడా రానప్పుడు నీవు సంపాదించిన డబ్బు నీకూడా ఎలా వస్తుంది. ఆయన డబ్బు సంపాదించటానికి కష్టపడ్డాడు కదా మరి మనస్సును బాగుచేసుకోవటానికి ఏమైనా కష్టపడ్డాడా? ఆయన మనస్సును బాగుచేసుకొన్నాడేమో చెప్పండి, సంతోషిద్దాము. మనం ఏదైనా ఒక విషయం గురించి ఆలోచించినా, ఏదైనా ఒక మాట మాట్లాడినా అది అహంభావనలో నుండి బయటకు రావటానికి మనకు ఉపయోగపడాలి, నువ్వు మాట్లాడే మాటల వలన, నువ్వు చేసే పనుల

వలన, నీకు వచ్చే తలంపుల వలన ఏమైనా అహంభావన తగ్గుతోందా లేక అహంభావన పెరుగుతోందా అది చూసుకో, అది జాగ్రత్తగా పరిశీలన చేసుకో, అదే నిజమైన సాధన. కొంతమంది గొప్పల కోసం ఏవో మాట్లాడుతూ ఉంటారు. అవసరం ఉండి మాట్లాడటం లేదు, గొప్పలకోసం మాట్లాడుతున్నాము అని మనకు తెలియకపోయినా వాడికి లోపల తెలుస్తూ ఉంటుంది. గొప్పలకోసం మాట్లాడుతున్నాడు అనుకోండి ఆ రోజుకు ఆరోజు వాడి బ్రెయిన్ పాయిజన్ అయిపోతుంది, అహంభావన చేత బంధింపబడతాడు, అది కోటి జన్మలకు కారణం అవుతుంది. కేవలం గురువు అనుగ్రహం వలన సుఖం, శాంతి నీకు దొరకాలిగాని యజ్ఞయాగాదుల వలన మీకు శాంతి దొరకదు. ద్వేషం లేనివాడు, కాంక్ష లేనివాడు, రాగద్వేషముల నుండి విడుదల పొందినవాడు ఏమీ కష్టం లేకుండానే బంధంలో నుండి విడుదల పొందుతాడు. నేను మోక్షాన్ని పొందాలి అని వాడికి కోరిక లేకపోయినా ఈశ్వరుడు వాడిని మోక్షంతో అలంకరిస్తాడు.

దేహం చనిపోయే వరకు ప్రారబ్దకర్మ ఉంటుందా, దేహం ఉండగానే ప్రారబ్దకర్మలో నుండి బయటపడవచ్చా అని భగవాన్‌ను అడుగుతున్నారు. దేహం జీవించి ఉండగానే ప్రారబ్దకర్మ నుండి బయటపడవచ్చు. నీకు రూపబుద్ధి లేదు అనుకో ప్రారబ్దకర్మ నిన్ను ఏమి చేస్తుంది. రూపబుద్ధి ఉన్నవాడికి ప్రారబ్దకర్మగాని రూపబుద్ధి లేనివాడికి ప్రారబ్దకర్మ ఏమిటి? శరీరం ఉన్నవాడికి రోగం, శరీరం లేనివాడికి రోగం ఏమిటి? దేహము నేను అనుకొనేవాడికి ప్రారబ్దం. వాడు నశిస్తే ప్రారబ్దం ఏమిటి? దేహము నేను అనే తలంపు దాని మూలంలోనికి వెళ్ళి నశిస్తే వాడికి రూపబుద్ధి నశిస్తుంది, నామబుద్ధి నశిస్తుంది. రూపబుద్ధి నశించిన వాడికి ప్రారబ్దకర్మ ఏమిటి? వాడు ప్రారబ్దం అనుభవిస్తున్నట్లు చూసేవాడికి అనిపిస్తుంది అంతే. మన పూర్వజన్మల కర్మలు మంచివి కావు అనుకోండి. ఎంత పెద్ద గడ్డిమేటు అయినా చిన్న అగ్గిపుల్లకు లోకువ అలాగే నీకు జ్ఞానం కలిగితే నీకు పూర్వజన్మలలో పెద్ద గడ్డిమేటుల వంటి ప్రారబ్దకర్మలు ఉన్నా అవి అన్నీ కాలి బూడిద అయిపోతాయి, అది జ్ఞానం యొక్క వైభవం, జ్ఞానమే నిజమైన ఐశ్వర్యం. బాబాగారి దగ్గరకు ఒకరు వచ్చి నా నోరు మంచిది కాదు ఎప్పుడూ ఎవరో ఒకరిని విమర్శిస్తూ ఉంటాను, తిడుతూ ఉంటాను, ఆ అలవాటు పోవటం లేదు అన్నాడు. అప్పడు బాబాగారు ఏమి చెప్పారు అంటే నువ్వు ఎవరినైనా తిట్టావు అనుకో వెంటనే రామనామం చేసుకో, కృష్ణనామం చేసుకో, భగవంతుడి నామం చేసుకొంటే నీపాడుబుద్ధి పోతుంది, తిట్టటం వలన వచ్చే పాపం కూడా పోతుంది అని చెప్పారు. మనం చెట్టు మొదలులో నీరు పోస్తే అది కొమ్మలకు, ఆకులకు, వేళ్ళకు, పండ్లకు, పుష్పాలకు అన్నింటికి ఆ నీరు వెళుతుంది అలాగే మీరు కృష్ణుడికి నమస్కారం పెడితే అది సమస్త దేవతలకు

వెళుతుంది. జ్ఞాని శరీరం ఉన్నా శరీరరహితుడు, నామం ఉన్నా నామ రహితుడు. నువ్వు ఎప్పుడైతే బ్రాహ్మీస్థితిని పొందావో అప్పుడు రూపబుద్ధిలో నుండి, నామ బుద్ధిలో నుండి నువ్వు జీవించి ఉండగానే విడుదలపొందుతావు. అప్పుడు నీ రూపాన్ని ఎవరైనా పూజించినా, నీ నామాన్ని పొగిడినా నీకు ఏమీ అనిపించదు. రూపం ఉండగా రూపరహితుడవు అవ్వాలి, నామం ఉండగా నామరహితుడవు అవ్వాలి, అప్పుడు వాడిని ప్రారబ్దం ముట్టుకోదు. మీకు ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి గాఢనిద్రలో నేను కష్టం అనుభవిస్తున్నాను అని ఏమీ అనుకోరు. గాఢనిద్రలో కూడా ఆ కష్టం ఉంది కాని కష్టం అనుభవిస్తున్నాను అనుకొనేవాడు గాఢనిద్రలో లేడు. వాడు మెలుకువ రాగానే వస్తున్నాడు, వచ్చి దేహాన్ని పట్టుకొంటున్నాడు. గాఢనిద్రలో నీకు వ్యక్తిభావన లేదు అక్కడ ఏ గొడవ లేదు. ఆ నిద్రాస్థితిని మాట మాటకు జాగ్రదవస్థలో జ్ఞాపకం పెట్టుకొని దానిని పొందు అంటారు భగవాన్. దేహం నేను అనే తలంపు వచ్చాక అన్నీ వస్తున్నాయి. గాఢనిద్రలో వాడు లేడు. జాగ్రదవస్థలో కూడా వాడిని లేకుండా చేసుకోగల్గితే అదే నీ కడసారి జన్మ.

భగవాన్ దగ్గరకు ఒకరు వచ్చి నాకు ఆత్మను తెలుసుకోవాలని ఉంది అన్నారు. నువ్వు ఆత్మవే కదా ఇంక తెలుసుకోవటం ఏమిటి అన్నారు. నువ్వు ఆత్మవే కాని ఇప్పుడు నీకు దేహం అనుభవంలో ఉంది, మనస్సు అనుభవంలో ఉంది, నేను ఆత్మను అన్న సంగతి నీకు అనుభవంలో లేదు. ఏ కారణాల వలన అది నీకు అనుభవంలో లేదో ఆ కారణాలను తొలగించుకోవటమే సాధన, అంతకంటే ఏమీ లేదు. మీకు డబ్బు తక్కువగా ఉంది అనుకోండి, చాలీచాలని సంసారాలు అనుకోండి, భగవంతుడు కావాలనే అలా ఇరుకున పెడతాడు. ఎందుచేతనంటే ఆయనను స్మరించుకోవటం కోసం, ఆవంపు పెట్టి మిమ్మల్ని అనుగ్రహించటం కోసం అలా చేస్తాడు. ధనం ఒకోసారి మదాన్ని పెంచుతుంది. కొంతమంది దుఃఖం వలన భగవంతుడిని స్మరించుకొంటారు, కొంతమంది దారిద్ర్యం వలన భగవంతుడిని స్మరించు కొంటారు. వీరు అదృష్టవంతులా, ధనం వలన మదం పెరిగినవారు అదృష్టవంతులా అని నేను చెప్పిన విషయం ఒక్కసారి అంతర్ముఖులై మీరు ఆలోచించుకోండి. నేను అనే తలంపు మన హృదయంలోనుండే వస్తోంది. నేను అనే తలంపు వచ్చాక మనస్సు వస్తోంది. మనస్సు వచ్చాక దేహం వస్తోంది, దేహం వచ్చాక లోకం వస్తోంది. లోకం వచ్చాక దేవుడు వస్తున్నాడు. ఏది వచ్చాక అన్నీ వస్తున్నాయో దాని మూలంలోనికి వెళితే ఏమీ లేదు, మనం మిగులుతాము, అదే ఆనందం, అదే సత్యం, అదే జ్ఞానం. మీరు పబ్లిసిటీ కోసం పనిచేస్తే పబ్లిసిటీ వస్తుంది కాని ఈశ్వరునిదయకు నువ్వు పాత్రుడవు కాలేవు. ప్రజాసేవ అంటే ఏమిటో తెలియని వారు కూడా ఫొటోలో పడటంకోసం ముందుకు వెళ్ళిపోతారు. కనీసం మనస్సులో కూడా

వారు ఇతరుల క్షేమం కోరరు. వారు లోకానికి దగ్గరగా ఉంటారు, దేవుడికి దూరంగా ఉంటారు. వారు చేసేది తింగరపనులు అని వారికి తెలియటంలేదు. ఇటువంటి వారి గురించి క్రీస్తు ఒకమాట చెప్పాడు. ఓ తండ్రీ వారు ఏమి చేస్తున్నారో వారికి తెలియదు, వారిని క్షమించి ఆశీర్వదించు అన్నాడు. మీలో ఎవరైనా పబ్లిసిటీ కోసం 100 మంచి పనులు చేసారు అనుకోండి, కొంతమంది అసలు మంచి పనులు చెయ్యలేదు అనుకోండి, వారు ప్రశాంతంగా ఉండి మనస్సులో లోకక్షేమం కోరుకొంటున్నారు అనుకోండి, లోకక్షేమం కోసం ఆలోచిస్తున్నారు అనుకోండి, బాహ్యంగా పబ్లిసిటీ కోసం మంచిపనులు చేసిన వారి పేరు కలకాలం ఉండదు, మీ తలంపులు లోకక్షేమం కోసం దాని చుట్టూ తిరుగుతూ ఉంటే వారి పేరు చిరస్థాయిగా ఉంటుంది. ఈరోజు రామకృష్ణుడు గురించి, బుద్ధుడి గురించి ఎందుకు చెప్పకొంటున్నాము. బుద్ధుడు ఎక్కడయినా నుయ్యి తవ్వించాడా? ఆస్పత్రి కట్టించాడా? లేదు. అది వారి ప్రేమలో ఉన్న వైభవం, జ్ఞానం యొక్క వైభవం.

ఎక్కడయితే వ్యక్తిభావనలేదో, ఎక్కడయితే దేహభావన లేదో వాడి దేహాన్ని ఉపయోగించుకొని ఈశ్వరుడు పనిచేస్తూ ఉంటాడు. వాడు గొప్ప పనులు చేస్తున్నాడు అని మనం అనుకొంటాము, అక్కడ చేసేది ఈశ్వరుడే. మీరు మంచిపని చేసారు అని ఒకరితో అంటే నేను ఏమిటి చేయటం, సంకల్పం ఈశ్వరుడిది, ఈ శరీరం ద్వారా చేయించుకొన్నాడు. నేను చేయటం ఏమిటి అన్నాడు. దేహానికి సంబంధించిన చావు గురించి ఆలోచించవద్దు, అది ఏదోరోజు చనిపోతుంది. అహంభావనకు ఎప్పడు చావు వస్తుంది అని చూడండి, దానికోసం ప్రయత్నం చేయండి. ఎప్పడైతే అహంభావన నశించిందో అప్పడు మీరు చైతన్యంలో ఐక్యమవుతారు. ప్రపంచంలో ఉన్న వస్తుజాలం అంతా మనకు బయటే ఉంది, మన దేహం కూడా మనకు బయటే ఉంది. అందుచేత అది మన కూడా రాదు. పూర్వజన్మలలో దేహాభిమానంతో అనేక కర్మలు చేసి ఉండవచ్చు. ఆ కర్మ అంతా ఈ జన్మలోనే రాదు. మొత్తం ఇస్తే ఈ శరీరం భరించలేదు. ఈ శరీరంలో ఎంత అనుభవించ గలవో అంతే ఇస్తాడు. కొంతపుణ్యం ఉండవచ్చు, కొంత పాపం ఉండవచ్చు. ఈలోపు నీవు సాధన చేసి గురువు అనుగ్రహం వలన దేహాభిమానాన్ని పోగొట్టుకొంటే ప్రారబ్దం, ఆగామి, సంచితం అంతా పోతుంది. అది జ్ఞానం యొక్క వైభవం. భగవంతుడు చెప్పిన మాటలు మనం వింటున్నాము. విన్న మాటలను మననం చేసుకోవాలి, వాటిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి, అప్పడు వారికి అన్ని కర్మలు నశిస్తాయి. అప్పడు వాడు చేసిన చేయని వాడితో సమానము. మీరు బాహ్యంగా చేసే పనులను భగవంతుడు చూడడు. పనిచేసేటప్పడు లోపల మీ భావన ఏమిటి అది చూస్తాడు. లోకంలో రకరకాల మనుషులు ఉంటారు. మీ

ఇంట్లో మీ మాట ఎవరైనా కాదంటే నా మాట ఎవరు వినటంలేదు అని వెంటనే క్షోభ వచ్చేస్తుంది. లోపల మీ మనస్సు హింసపడిపోతుంది. భగవంతుడు చెప్పిన మాటలు మీరు వినరు అనుకోండి ఆయన ఏమీ వికారం పొందడు, నిదానంగా ఉంటాడు, ద్వైతం లేకుండా ఉంటాడు. ఎట్టిపరిస్థితులలోను మానసికఒత్తిడి రాకుండా చూసుకోండి. మనస్సు పొంగిపోకూడదు, మనస్సు కుంగిపోకూడదు, ఎప్పుడూ సమానంగా ఉండేటట్లు చూసుకోండి. ఇతరులను పరిశీలించటం కాదు మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి, మీరు అంతర్ముఖులై మిమ్మల్ని మీరు చూసుకోండి. జ్ఞానం సంపాదించుకోవటానికి కృషి చేయండి.

మీరు ఒకరితో ఒకరు కలిసి ఉంటున్నారు కదా. ఆ ఉండేది ఏదో భగవంతుడితో కలిసి ఉండండి అంటున్నారు భగవాన్. మీ గురించి మీరు ఆలోచించుకోవటం తగ్గించే కొలది భగవంతుడు మీ గురించి ఎక్కువ ఆలోచిస్తాడు. మీ నెత్తిమీద భారం వేసుకోవద్దు. ఆయన మీద భారం వేసి మీరు శాంతిగా ఉండండి. మీరు భగవంతుడికి దూరం అయిపోతున్నారు అనుకోండి. ఒకోసారి మీ మనస్సుకు దుఃఖం కలిగించవచ్చు, ఒకోసారి మీ ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు రావచ్చు. మీకు దుఃఖం కలిగించినా, ఆర్థిక బాధ కలిగించినా ఇదంతా ఆయన ఒడిలోనికి మిమ్మల్ని తీసుకోవటానికే చేస్తున్నాడు, ఇదంతా ఈశ్వరుని లీల అంతేకాని మీరంటే ఇష్టంలేక కాదు. కర్మ జీవుడు చేస్తాడు, కాని ఆ కర్మ ఫలితాన్ని జీవుడికి ఎప్పుడు అనుభవంలోనికి తీసుకొని రావాలి అని నిర్ణయించేది ఈశ్వరుడే. నిర్వాణ సుఖం ఒక్కటే నిజమైన సుఖం. నువ్వు అన్ని విధముల ప్రయత్నం చేసి, సత్పురుషులతో సహవాసం చేసి, వారి అనుగ్రహాన్ని సంపాదించి నిర్వాణసుఖాన్ని పొందు అని ఆనంద్‌తో బుద్ధుడు చెపుతాడు. బాహ్యంగా ఏదో గొప్ప కర్మలు చేస్తే సరిపోదు. అహంభావన అనే దీపం ఆరిపోకుండా నీకు నిర్వాణసుఖం రాదు అని బుద్ధుడు చెప్పాడు. ఆశ అనే దీపం ఆరిపోయిన తరువాత కదా నీకు ఆత్మజ్ఞానం కలిగేది. బుద్ధుడి టైములో అంగుళీమాళుడు అని ఒకడు అనేక వందలమందిని చంపాడు. అతనితో బుద్ధుడు అంటాడు నీవు అనేక మందిని చంపావు, వారిని జయించాను అనుకొంటున్నావు. నీ అహంభావనను నువ్వు చంపుకోలేదు, ఇంక నీవు సాధించింది ఏమిటి అంటాడు. తరువాత బుద్ధుడితో సహవాసం వచ్చాక వాడు బుద్ధుడి మీద పరిపూర్ణవిశ్వాసం పెట్టుకొన్నాడు. బుద్ధుడితో సహవాసం వలన, ఆయన మీద పరిపూర్ణవిశ్వాసం పెట్టుకోవటం వలన వాడు నిర్వాణసుఖాన్ని పొందాడు. బుద్ధుడి శరీరం ఉండగానే వాడు చనిపోయాడు. అక్కడ ఉన్నవారు బుద్ధుడితో వాడు పూర్వం చాలామందిని చంపాడు, వాడు నరకానికి వెళతాడా అని బుద్ధుడిని అడిగారు. వాడు నరకానికి వెళ్ళడు, వాడు స్వర్గానికి వెళ్ళడు, వాడు నిర్వాణసుఖాన్ని పొందాడు అని బుద్ధుడు

చెప్పాడు. అంటే బుద్ధుడితో సహవాసం వలన వాడి కర్మ అంతా కాలిపోయింది. బుద్ధుడు తాను నిర్వాణసుఖాన్ని పొందటమే కాకుండా, ఆయన మీద విశ్వాసం వలన అంగుళీ మాళుడి చేత పొందింపచేసాడు. బుద్ధుడు ప్రసన్నాత్ముడు. ఆయనను చూసి, దర్శన మాత్రం చేతనే అనేకమంది నిర్వాణసుఖాన్ని పొందారు, అది జ్ఞానం యొక్క వైభవం. కొంతమంది కీర్తి పిచ్చివాళ్ళు ఉంటారు, గౌరవం సంపాదించాలి అని అనుకొంటూ ఉంటారు, గౌరవం సంపాదించాలనుకొనేవాడు ఎంత కష్టపడి ఆ గౌరవం సంపాదించుకొంటాడో అలాగ అన్ని విధముల ప్రయత్నం చేసి నువ్వు ఆత్మజ్ఞానాన్ని సంపాదించు అని పరమాత్మ చెపుతున్నాడు.

వేపపువ్వు పచ్చడి అంటే కొంచెం చేదుగా, కొంచెం తియ్యగా ఉంటుంది. అలాగే జీవితంలో కష్టం ఉంటుంది, సుఖం ఉంటుంది. కష్టసుఖాల మిశ్రమమే జీవితం. ఈ రెండూ బేలెన్స్ చేసుకొంటూ మనం జీవించాలి. అందుకే వేపపువ్వు పచ్చడి మన చేత తినిపించటం. ఏ కారణం వలన అయినా మీరు దుఃఖప్రారబ్ధం అనుభవిస్తున్నా కంగారు పడవద్దు. మీ దుఃఖప్రారబ్ధం మీకు ధర్మబుద్ధిని, జ్ఞానాన్ని కలుగజేయవచ్చు. అనుభవించే టప్పుడు మీకు కొంచెం చేదుగా ఉన్నా తరువాత తియ్యగా ఉంటుంది. అందుచేత మీరు వేగిరపడవద్దు, భగవంతుడిని తిట్టిపోసుకోవద్దు. దుఃఖప్రారబ్దం కూడా మిమ్మల్ని అనుగ్రహించ టానికే అని మీరు మర్చిపోకండి. మీకు ఎంత దుఃఖప్రారబ్దం ఉన్నా మీకు రూపబుద్ధి, నామ బుద్ధి లేకపోతే అది మిమ్మల్ని ఏమి చేస్తుంది, అది అంతా కాలి బూడిద అయిపోతుంది అంటున్నారు భగవాన్. ఎంత అద్భుతంగా ఉందో చూడండి. అంతర్ముఖుడు కానివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. మీరు భౌతికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే మీరు అంతర్ముఖులవ్వాలి. అంతర్ముఖుడు కానివాడికి ఈ లోకం లేదు, పరలోకం లేదు. నువ్వు కళ్ళు మూసుకోనక్కరలేదు, చెవులు మూసుకోనక్కరలేదు, నీవు ఈ ప్రకృతిని విశదంగా పరిశీలించు. ప్రపంచంలో ఉన్న మనుషులను, సంఘటనలను సాత్వికబుద్ధితో పరిశీలిస్తే నీకు వివేకం పెరుగుతుంది, వైరాగ్యం పెరుగుతుంది. వివేకం, వైరాగ్యం హృదయంలో ఉన్న నిజమైన ఇంటికి నిన్ను తీసుకొనిపోతాయి. ప్రతిఘటన వద్దు, ప్రకోపం వద్దు. లోకంలోని సంఘటనలను నీ కళ్ళతో చూడుకాని సాత్వికంగా చూడు, మాటలు విను కాని సాత్వికంగా విను. సాత్వికబుద్ధితో ఈ క్రియేషన్‌ను పరిశీలించటం నేర్చుకొంటే క్రియేటర్ దగ్గరకు వెళ్ళి పోతావు. ఈ సృష్టికి ఎవడైతే ఆధారమో వాడి పాదాలను చేరుకొంటావు. ఇంక ఈ శరీరం అనే అద్దె కొంపలలోనికి రానక్కరలేదు. ఈ ప్రకృతిని సాత్వికబుద్ధితో చూస్తూ పాఠాలు నేర్చుకొని బాగుపడు. ఈ వ్యయనామ సంవత్సరంలో మీ మాటలు, మీ పనులు, మీ తలంపులు ఏది వ్యయం చేసినా మంచికే చెయ్యండి, అది వ్యయనామ సంవత్సరం చెప్పే బోధ.

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | |
|---|---|
| 11-05-06 గురు | భీమవరం, వెంకటేశ్వర స్వామి దేవాలయం |
| 17-05-06 బుధ | గుమ్మలూరు, క్షత్రియ కళ్యాణ మండపం |
| 21-05-06 ఆది | పాలకొల్లు, క్షత్రియ కళ్యాణ మండపం |
| 24-05-06 నుండి<br>01-06-06 వరకు | అరుణాచలం క్యాంపు |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# ఆత్మలో సువాసనలు - మనస్సులో దుర్వాసనలు

సమత్వంగల జ్ఞానికి ఆశ్చర్యం, గర్వం, సమ్మోహం, దూషభూషణలు ఎన్నటికీ కలుగవు. నిర్భయత్వము, నిత్యత్వము, జ్ఞానము, నిరపేక్ష, నిష్క్రియత్వము, నిర్వికల్పము, ధైర్యము, మైత్రి, సుబుద్ధి, తృప్తి, శాంతి, మృదుభాషణలు మొదలగు సువాసనలతో నిండి ఉంటాడు. సర్వకాల సర్వ అవస్థలలోనూ ఈ ప్రపంచం అసత్యమని నిశ్చయించి ధృడంగా ఉంటాడు. అడిగిన చోట ఉపయోగకరమైన మాటలు పలుకుతాడు. రాగ ద్వేష విముక్తుడైనవాడు దుఃఖితుడు కాడు. ఎచ్చట మనస్సు ఉంటుందో అచ్చట స్మశానమందు కాకులవలె అనేక రకములైన ఆశలు, ప్రకృతి సుఖదుఃఖాలు వచ్చి చేరుతాయి. కోరిక అనే పిశాచంచే సేవింపబడింది, అనంతకోటి దేహాలను ధరించి అజ్ఞానమనే మహా అరణ్యంలో సంచరిస్తూ చిత్త చాపల్యకారణమైనది, ఇది అజ్ఞానులలో ప్రత్యక్షంగా కనబడుతుంది. తన దేహ రూపాన్ని నిరంతరం తింటూ ఉండటం వల్ల అమంగళమై ఉంటుంది. కోరికలనే తృష్ణచే అన్ని దిక్కులలోనూ సంచరించటం వల్ల శ్రమతో పీడించబడుతూ ఉంటుంది. అవమానం, ధనవ్యయం, శోకం, భయాదులనే కాకుల ముక్కులచే పొడవబడి, క్షోభతో పొర్లాడుతూ ఉంటుంది. తిరిగి శక్తి పుంజుకోవటానికి విషయ భోగాలనే మాంసాన్ని తింటుంది, రోగాలతో కూడిన భోగాలు అంటే దీనికి బలే సరదా. దృశ్యాల ఆశ్వాదనకోసం అన్ని దిక్కులను చూస్తూ ఉంటుంది. పంది బురద మెచ్చుగాని పన్నీరు మెచ్చుతుందా! ఎండు చేపల వర్తకులకు మల్లెపూల పందిర దగ్గర పక్క వేసినా నిద్రపడుతుందా? భయంకరమైన కోరికలను ధరించే ఈ మనస్సు దేహాభిమానమనే వటవృక్షం నీడ నుండి ఎప్పుడు ఎగిరిపోతుందో అప్పడే దానికి అన్ని విధాలైన జయాలు కలుగుతాయి. శ్రీనాన్నగారు “దైవీ జివితంలో వ్యాపారం ఉండదు, కోరిక ఉండదు ప్రేమ ఉంటుంది. నీలోని ఆనందాన్ని అప్రయత్నంగా అనుభవించటమే సమాధి” అన్నారు. కాబట్టి దుర్వాసనలతో కూడిన ఈ చిత్త పిశాచాన్ని వివేక, వైరాగ్యాలతో నిరంతర జాగరూకతతో జీవిస్తే ఇందుండి బయట పడగలము. గురు సన్నిధిలో ఉన్నంత చల్లని నీడ, సువాసనలు ఈ ప్రపంచంలో ఎక్కడా కనిపించవు. ప్రకృతి మనసులతో జాగ్రత్త అంటుంది గురుప్రేమ. ఆ గురు ప్రేమలో జీవించాలి, తరించాలి.

**– సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం

# సద్గురు శ్రీ నాన్నగారి దండకం

శ్రీ నాన్నగురుదేవా ఆనంద చిద్భావా శ్రిత భక్త
ప్రియ బాంధవా, కనులకజ్ఞాన తిమిరమ్ము తొలగించి
కరుణించు లోకైక దీపాంకురా! ఈ ధరిత్రిన్
శిష్టులన్ బోధతో దుష్టులన్ సకల జన సంఘమున్,
కాచి రక్షించి పాలింప సాక్షాత్ ఆ దివ్య అరుణగిరి నాధుడే
రమణఋషి రూపాన నీ పైన కరుణించి ప్రియ శిష్యునిగ
ఎంచి స్వప్నాన అరుదెంచి ప్రియమార దీవించు
మహిమోన్నతంబౌ, ఆ ఘటన వినినంతనే.....
మాదు ఒడలంత పులకించి మదిలోన మిమ్మింక
సద్గురువుగా ఎంచి కైమోడ్పు విడినామయా!

వరపుణ్య గోదారి తటవర్తియై వెలుగు
జిన్నూరు గ్రామాన్ని చెన్నొందు ఆధ్యాత్మ అద్వైత శిఖరాగ్రిగ
ఆంధ్ర అరుణాచలము మాడ్కి, సంక్షేత్రమును చేసి
అతి భక్తి మిము చేరు భక్తాళి భవతాపమున్,
మీదు పీయూష వాగ్ధారలన్ అంతమొందించి
ఆతాప పాపౌఘముల్, మదిని వేడంగ చిత్తమున
మిము కొల్చువారికన్, దర్శించు ప్రతి వారికిన్
ఏవేళ కలిగించు మీ దయల మీ కృపల ఘన కీర్తి
దాటి పోనట్టి ఎల్లలున్ సీమలున్ గలవే!
కర్మ శేషంబుతో మిము జేరు మానవుల దుఃఖంబులన్
బాపి రక్షించు మీ లీలలవి ఎన్నంగ మాశక్యమే!

ఇహలోక సౌఖ్యములన్ కోరి మీ కడకు
అడుగిడిన భక్తులన్, తొలుత మృదుమందహాసంబునన్
శాంత చిత్తులన్, చేసి పిదప అంతర్ముఖం జేసి,
భవబంధ ముక్తులన్ గావించి జన్మ కడతేర్చు
ఆ ఆత్మ జ్ఞానమున్ కరతలామలక మగునట్లు
కరుణించు సద్భక్త చింతామణీ!

నేడు నీ దివ్య పాదాంబుజములే కాక
దిక్కేది లేదనుచు, శరణింక నీవనుచు
నీ చెంతకున్ చేరు భక్త కోటిన్ సదా దయతో
కాపాడు..... ఓ దీన బంధూ........ దయా సింధూ........
........శ్రీ నాన్న గురుదేవా నమస్తే........ నమస్తే...... నమః